RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 279 మేడ్చల్ మల్కాజ్‌గిరి 31 అక్టోబర్ 2024 గురువారం పేజీలు : 4

## పశ్చిమ నౌకాదళంలోకి ఐఎన్ఎస్ విక్రాంత్

ముంబై : అరేబియా సముద్రంలో భద్రతను మరింత పెంచే దిశగా కీలక ముందడు గు పడింది. దేశీయంగా తయారైన విమాన వాహ క నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ పశ్చిమ నౌకాదళంలో చేరింది. ఈ విషయాన్ని భారత నేవీ వెల్లడించింది. ఇప్పటికే విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య సేవలందిస్తుండగా... తాజాగా ఐఎన్ఎస్ విక్రాంత్‌తో పశ్చిమ నౌకాదళంలో రెండు విమాన వాహక యుద్ధ నౌకలు చేరినట్టయింది.

# కులగణనలో తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా మార్చాలి




## కుల గణనపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు..

హైదరాబాద్ : కులగణనలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా మార్చాలని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సోనియాగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టి తీరుతామని స్పష్టం చేశారు. కులగణనపై గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న సీఎం.. ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. కుల గణనపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది ప్రత్యేక అబ్జర్వర్లను నియమించాలని రేవంత్ రెడ్డి సూచించారు. గాంధీ భవన్ లో నిర్వహించిన కుల గణన మీటింగ్ లో తెలంగాణ సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గాంధీ కుటుంబం ఒక మాట ఇస్తే హరిహరాదులు అడ్డు వచ్చినా అది నెరవేర్చి తీరుతుందన్నారు. మనం మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టే వారసులం అని చెప్పుకొచ్చారు. రేవంత్ కి ప్రత్యేక గుర్తింపు ఏమీ లేదు.. కాంగ్రెస్ పార్టీనే గుర్తింపు ఇచ్చిందని ఆయన తెలిపారు. మీరంతా కష్టపడితేనే నాకు ఈ బాధ్యత వచ్చింది..

పార్టీ ఎజెండాతోనే ప్రజల్లోకి వెళ్లాం.. పార్టీ విధానాన్ని అమలు చేయడమే మన ప్రభుత్వ విధానం.. పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా.. ప్రతీ క్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ క్యాడర్, లీడర్స్ మీద ఉందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇక, కుల గణనపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది అబ్జర్వర్స్ ను నియమించాలని సీఎం రేవంత్ సూచించారు. బాధ్యతగా పని చేయండి.. మీ కష్టానికి ఫలితం తప్పకుండా ఉంటుంది.. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా వారిని పార్టీ క్షమించదు.. నవంబర్ చివరిలోగా కులగణన పూర్తి చేసి భవిష్యత్ యుద్ధానికి సిద్ధం కావాలని సూచించారు. అలాగే, తెలంగాణ నుంచే నరేంద్ర మోడీపై యుద్ధం ప్రకటించాలి అని ఆయన తెలిపారు. కుల గణన ఎక్స్ రే మాత్రమే కాదు.. ఇది మెగా హెల్త్ చెకప్ లాంటిది.. భవిష్యత్ లో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో మన మోడల్ ను పరిగణనలోకి తీసుకునేలా మోడల్ డాక్యుమెంట్ ను కేంద్రానికి పంపుతామని తెలంగాణ ముఖ్యమంత్రి అన్నారు. అలాగే, కొంతమంది అగ్రవర్ణాల కోసమే గ్రూప్– 1 నిర్వహిస్తున్నారని.. బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నారని ఒక వాదన తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. సెలక్ట్ అయిన 31,383 మందిలో 10 శాతం లోపు మాత్రమే అగ్రవర్ణాలు ఉన్నారు.. పార్టీకి నష్టం చేకూర్చేలా ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ సహించదు అని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి చట్టాన్ని అమలు చేస్తాడు తప్ప.. వ్యక్తిగత ఎజెండాతో పని చేయడు అని ఆయన తెలిపారు.




ఏడాది తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఉండదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పని తీరే ఇందుకు కారణమన్నారు. కేసీఆర్ పేరు ఇప్పుడు తెలంగాణలో ఎక్కడా వినపడడం లేదన్నారు. గతంలో తమ పార్టీ ఎమ్మెల్యేలను లాక్కున్న సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్క ఐదుగురు ఎమ్మెల్యేలతో పోరాటం చేశారన్నారు. అసలు కేసీఆర్ ఫామ్ హౌజ్ లో ఉన్నాడా? లేడా? అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు.

**మాతో టచ్ లో 20 మంది ఎమ్మెల్యేలు..** ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్ కు టచ్ లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కోమటిరెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ నుంచి మరో 20 మంది ఎమ్మెల్యేలు రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కానీ తామే వద్దంటున్నామన్నారు. తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కోమటిరెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు.




తెలంగాణలో రాజకీయ పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. దీపావళి రోజు పొలిటికల్ బాంబ్ పడబోతుందని రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. ఈ మేరకు ఇప్పటికే రాజ్భవన్కు సైతం సమాచారం ఇచ్చినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తొలి బాంబు కేటీఆర్పైనే పడబోతుందని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే మళ్లీ తెరపైకి ఫార్ములా ఈ – కార్ రేస్ కేసు వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వ్యవహారంపై ఏసీబీకి మున్సిపల్ అధికారులు ఫిర్యాదు చేశారు. నిధుల బదలాయింపుపై విచారణ జరపాలని అధికారులు కోరారు. గత ప్రభుత్వ హయాంలో నిబంధనలు పాటించకుండా ఫార్ములా ఈ – కార్ రేసు నిర్వహణ సంస్థకు రూ.55 కోట్లను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ చెల్లించింది. గతంలో కేటీఆర్ ఆధ్వర్యంలోనే ఈ MAUD శాఖ ఉండేది. ఇప్పటికే ఈ అంశంపై ప్రభుత్వానికి అప్పటి కమిషనర్ అరవింద్ కుమార్ వివరణ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఫార్ములా ఈ – కార్ రేసును రేవంత్ సర్కార్ రద్దు చేసింది. బోర్డు, ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఓ విదేశీ సంస్థకు గత ప్రభుత్వం రూ.55 కోట్లు చెల్లించిందని ఆరోపిస్తోంది. ఈ వ్యవహారం నాటి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి అయిన కేటీఆర్ కు చుట్టుకుంటుందన్న టాక్ వినిపిస్తోంది. ఈ వ్యవహారంలో ఆయన అరెస్ట్ అయ్యే అవకాశం కూడా ఉందన్న చర్చ సాగుతోంది.

**పొంగులేటి బాంబ్ ఇదేనా? :** ఇటీవల సియోల్ పర్యటనకు వెళ్లిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్రంలో పొలిటికల్ బాంబులు పేలనున్నాయంటూ సంచలన ప్రకటన చేశారు. ఒకటి రెండు రోజుల్లోనే ఈ బాంబులు పేలుతాయన్నారు. అయితే.. ఈ నెల 26న మంత్రివర్గ సమావేశం అనంతరం ఇందుకు సంబంధించిన ప్రకటన ఉంటుందని అంతా భావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు, ఫోన్ ట్యాపింగ్ తదితర వ్యవహారాల్లో బీఆర్ఎస్ ముఖ్యులు అరెస్ట్ ఉంటుందన్న చర్చ సాగింది. అయితే.. అలాంటిదేమీ జరగలేదు. అయితే.. దీపావళిలోగా బాంబు పేలుతుందని పొంగులేటి మంత్రివర్గ సమావేశం తర్వాత మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అయితే.. ప్రస్తుతం ఫార్ముల ఈ–కార్ రేసు కేసు వ్యవహారంలో ఏసీబీ దూకుడు చూసి పొలిటికల్ బాంబ్ ఇదేనన్న చర్చ సాగుతోంది.




# ఏం కొంటాం... ఏం తింటాం...



## పెరుగుతున్న కూరగాయల ధరలు - ఆకాశాన్నంటిన నిత్యావసరాలు

## పండుగ పూటా.... పస్తులేనా...!?

హైదరాబాద్ / అమరావతి : రోజు రోజుకి చుక్కలనంటుతున్న కూరగాయల ధరలు ప్రజలను కన్నీరు పెట్టిస్తున్నాయి. బడ్జెట్ మొత్తం చాలక అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. భారీ వర్షాలతో కొరత. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల కొరత ఏర్పడ్డాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి టమాటా వంటి అవసరమైన స్థాయిలో సరఫరా కావడం లేదు వర్షాల వల్ల పంట నష్టపోయి దిగుబడి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పండగలు రావడంతో ధరలకు రెక్కలు వచ్చాయి. టమోటా రూ.35లు, ఉల్లిగడ్డలు రూ.60లు, బీన్స్ రూ.70లు, ముల్లంగి రూ.46లు, దొండకాయ రూ.50లు, క్యారెట్ రూ.56లు, బీరకాయలు రూ.48లు, బెండకాయలు రూ.34లు, క్యాలీఫ్లవర్ రూ.40లు, ఆలుగడ్డలు రూ.44లు, దోసకాయలు రూ.42లు.

**కార్తీక మాసం మూగిసేదాకా ఇంతే..** కార్తీకమాసం మూగిసేదాకా ధరలు దిగిరావేమో నని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ వారంలో అల్పపీడనంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని సమాచారం. అక్టోబరులో కూరగాయల వినియోగం అధికంగా ఉంటుంది. దీంతో పెరిగే అవకాశముందని ప్రభుత్వం, ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు తీసుకుని ధరలు పెరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

**కాగుతున్న నూనెలు..** గణేశ్ చతుర్థితోనే పండగల కాలం మొదలైంది. ఇక వరుసగా వచ్చే పండగలకు పిండి వంటలు ఒండుదా మంటే.. వంట నూనెల ధరలు భయపెడుతున్నాయి. సాధారణంగా కార్తీక మాసంలో కూరగాయల ధరలు పెరుగుతాయి. అలాగే ఖరీఫ్ కాలం పూర్తయి.. రబీకాలం పంట ప్రారంభమయ్యే లోపు పెరగాల్సిన కూరగాయలు ఇప్పుడే భగ్గుమంటున్నాయి. నూనె ప్యాకెట్లు కొనాలన్నా.. కూరగాయలు తెచ్చుకుందామన్నా సామాన్యులు వెనుకడుగువేయాల్సిన పరిస్థితి వంటగదిలో ధరల మంట మోగిస్తోంది. నూనెలు, వెల్లుల్లి, కాయగూరలు, కొత్తిమీర ఇలా ప్రతిదీ ధర పెరగడంతో నెలవారీ బడ్జెట్ పెరిగిపోతోంది.



**కారణాలు ఇవి..** వర్షాలతో పంటలు దెబ్బతినడంతో కాయగూరలు, వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో అన్నీ రకాల నూనెల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. అన్నీ ధరలు ఒకేసారి పెరగడంతో సామాన్యుడు ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. వర్షాల కారణంగా కొత్తిమిరతో పాటు ఆకు కూరలు దెబ్బతిన్నాయి. రైతుబజార్లలో రూ.300 కేజీ చొప్పున కొత్తిమిర విక్రయిస్తుండగా బహిరంగ మార్కెట్‌లో బంగారంలా తూచి విక్రయిస్తున్నారు. బెండకాయ, కాకర, బీరకాయ, బీన్నీస్, గోకరకాయ, క్యాప్సికం ధరలు బహిరంగ మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.100 చొప్పున ధర పలుకుతోంది. ఉల్లి ధరలు ఘాటెక్కాయి. బహిరంగమార్కెట్‌లో రూ.60లు కేజీ చొప్పున విక్రయిస్తున్నారు. వెల్లుల్లి ధర భారీగా పెరిగింది. కేజీ రూ.450 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం కేజీ రూ.160కి విక్రయిస్తున్నారు. మూడు రోజుల క్రితం వరకు రైతుబజార్లలో రూ.20 కేజీ ఉన్న టమాటా ప్రస్తుతం రూ.39కి చేరింది. రిటైల్ ధర రూ.45గా నిర్ణయించగా బహిరంగ మార్కెట్‌లో రూ.60కి విక్రయిస్తున్నారు. ఉల్లిగడ్డ రూ. వంద పెడితే కాని రెండు కిలోలు రావడంలేదు. మెహిదీపట్నం, ఫలక్‌నుమా, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి, అల్వాల్, రామక్రిష్ణాపురం, సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలకు కేవలం 552 క్వింటాళ్ల చొప్పున స్టాక్ వచ్చింది.

**తినలేని పరిస్థితి...** ఒకప్పుడు రూ.వందకు వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు ఒక్క కూరగాయనే రూ.40పైగా పలుకుతోంది. ధరలను నియంత్రించాలి.

**ధరలను నియంత్రించాలి...** కూరగాయల ధరలను ప్రభుత్వం, అధికారులు నియంత్రించాలి. ఉద్యానవన శాఖ అధికారులు కూరగాయల సాగును ప్రోత్సహిస్తే ధరలు తగ్గుతాయి.

# సంపాదకీయం

## కాశ్మీర్ కి రాష్ట్ర హోదా.... కొత్త ఎత్తుగడలో బీజేపీ ?

కేంద్రంలో బీజేపీ జమ్మూ కాశ్మీర్ విషయంలో ఏ రాత రాయనుంది అన్నదే ఇపుడు అంతటా ఆసక్తికరంగా సాగుతున్న చర్చ. దేవుడు అందరి రాతలు రాస్తారు కానీ జమ్మూ అండ్ కాశ్మీర్ రాత మాత్రం అచ్చంగా కమలనాధులే రాయాల్సిన అవసరం ఉంది. వారి చేతిలోనే అది ఉంది. బీజేపీ పెద్దలు తలచుకుంటే జమ్మూ అండ్ కాశ్మీర్ దేశంలో 29వ రాష్ట్రంగా మళ్లీ చేరుతుంది. లేదూ అనుకుంటే కంద్ర పాలిత ప్రాంతాల పక్కన నిలబడుతుంది. ఇదిలా ఉంటే ఇటీవలే జమ్మూ అండ్ కాశ్మీర్ లో ఎన్నికలు ముగిసాయి. నేషనల్ కాన్ఫరెన్స్ ప్లస్ కాంగ్రెస్ కూటమి అక్కడ అధికారం చేపట్టింది. కొత్త ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు స్వీకరించారు. ఆయన తొలి ప్రసంగంలోనే జమ్మూ అండ్ కాశ్మీర్ కి రాష్ట్ర ప్రతిపత్తిని సాధిస్తామని చెప్పారు. అంతే కాదు 370 ఆర్టికల్ ని పునరుద్ధరిస్తామని కూడా అన్నారు. ఆ మాట చాలా పెద్దది. అది జరిగేది అయితే కాదు అని తెలిసిందే. ఎన్నికల హామీగా దానిని జనంలో ఉంచి నేషనల్ కాన్ఫరెన్స్ భారీగా సీట్లను గెలుచుకుంది. నేషనల్ కాన్ఫరెన్స్ తో పొత్తు పెట్టుకుని కూడా కాంగ్రెస్ అయితే ఈ విషయంలో ఎలాంటి క్లారిటీ మాత్రం ఇవ్వలేదు. మరి ఇండియా కూటమి 2029లో అధికారం లోకి వస్తే అపుడు కాంగ్రెస్ ఏమైనా చేయగల దేమో కానీ ఇపుడు అయితే ఏమీ చేయలేదు. అందుకే ఆ పార్టీ ఈ హామీ విషయంలో ఏమీ మాట్లాడలేదు కూడా. మరో వైపు చూస్తే ఒమర్ అబ్దులా గతంలో సీఎం గా చేశారు. అపుడు ఆయనకు అపరిమితమైన అధికారాలు ఉన్నాయి. 370 ఆర్టికల్ ఉంది. స్వయంప్రతిపత్తి కలిగిన రాష్ట్రంగా కాశ్మీర్ ని ఆయన ఒక్క లెక్కన ఏలారు. ఇపుడు ఆయనకు కొంత ఇబ్బందికరంగానే ఉంది. అయితే ఆయన ముందు రాష్ట్ర హోదా సాధిస్తే సీఎం గా తన ఇమేజ్ బాగా పెరుగుతుందని భావిస్తున్నారు. అందుకే ఆయన ఢిల్లీకి వచ్చి ప్రధాని నరేంద్ర మోడీని హోం మంత్రి అమిత్ షాను కలిశారు. కేంద్ర పెద్దలు ఇద్దరితోనూ ఆయన జరిపిన మంతనాలు చూస్తే ఆయన మీడియా మీటింగులో మాట్లాడిన తరువాత ఆయనలో ఆశలు పెరిగాయి. ధీమా కూడా కలిగింది. తొందరలో కాశ్మీర్ కి రాష్ట్ర హోదా దక్కుతుందని ఒమర్ అబ్దుల్లా అంటున్నారు. ఈ విషయంలో కేంద్ర పెద్దలు సుముఖంగా ఉన్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒమర్ అబ్దుల్లా మాటలను బట్టి చూస్తే ఆయన ఢిల్లీ టూర్ ఈ విధంగా సక్సెస్ అయినట్లే అనుకోవాలి. అయితే కేంద్ర బీజేపీ పెద్దలు ఆ దిశగా ఆలోచిస్తున్నారా అన్నదే చర్చగా ఉంది. ఎందుకంటే జమ్మూ అండ్ కాశ్మీర్ లో తానే గెలిచి పాలించాలని బీజేపీ గట్టిగా భావించింది. బీజేపీని జమ్మూ ఆదరించింది. కాశ్మీర్ లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. మరో వైపు చూస్తే కేంద్ర పాలిత ప్రాంతంగా జమ్మూ అండ్ కాశ్మీర్ ఉంటే కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా ఇండైరెక్ట్ గా పాలన సాగించవచ్చు. మరి ఈ మంచి అవకాశాన్ని బీజేపీ వదులుకుని నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్ కూటమికి మేలు చేస్తుందా అన్నదే కీలక పాయింట్. మరో వైపు రాష్ట్ర హోదా ఇచ్చి పూర్తి అధికారాలు నేషనల్ కాన్ఫరెన్స్ కి ఇస్తే ఉగ్ర వాదులు మళ్లీ వీర విహారం చేస్తారు అన్నది కూడా కేంద్రానికి అనుమానం ఉంది అని అంటున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే కాశ్మీర్ ప్రజల మద్దతుని రాజకీయంగా గెలుచుకునేందుకు రాష్ట్ర హోదా ఇవ్వవచ్చు అని అంటున్నారు ఏనాటికి అయినా జమ్మూ అండ్ కాశ్మీర్ లో అధికారంలోకి రావాలీ అంటే కాశ్మీర్ ప్రజల మద్దతు అవసరం. దాంతో రాష్ట్ర ప్రజల కోరికగా మన్నించవచ్చు అని అంటున్నారు. బహుశా మహారాష్ట్ర జార?ండ్ ఎన్నికలు పూర్తి అయిన తరువాత కేంద్రం నుంచి కీలక ప్రకటన వెలువడవచ్చు అని అంటున్నారు.

## ఎమ్యూనరేటర్లు బాధ్యతగా ఇంటింటికి వెల్లి సమగ్ర కుటుంబ సర్వేను చెయ్యాలి : ఎంపీడీఓ

### మండల పరిషత్ లో ఎమ్యూనరేటర్లకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శిక్షణ



శామీర్ పేట, (గరుడ వార్తా) ప్రభుత్వ ఆదేశాలనుసారం ఎమ్యూనరేటర్లు బాధ్యతగా విధులను నిర్వర్తిస్తు ఇంటింటికి వెల్లి సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీఓ మమతబాయి తెలిపారు. బుధవారం శామీర్ పేట మండల పరిషత్ లో ఎంపీడీఓ మమతబాయి, ఎంపీఎస్ఓ రవీందర్, ఎంపీఓ వినూత్న లు మండలంలో నియామకమైన ఎమ్యూనరేటర్లకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై అవగాహన కల్పించారు. ఎమ్యూనరేటర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికి విధిగా వెల్లి ఇచ్చిన సర్వే ఫారాలను తప్పులు లేకుండా కుటుంబ వివరాలను అడిగి పూర్తి చేయాలని వారు చెప్పారు. కుటుంబ సర్వేలో ఏ ఒక్క ఇళ్లు, కుటుంబ వివరాలు తప్పి పోకూడదని, కుటంబానికి సం బంధించిన వివరాలను తప్పనిసరి సేకరించి ఫారాలలో పూర్తి చేయాలని వారు ఎమ్యూనరేటర్లకు సూచించారు. సమగ్ర కుటుంబ సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఎమ్యూనరేటర్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. శిక్షణ అనంతరం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి మెటీర్యల్ ను ఎమ్యూనరేటర్లకు అందజేశారు. శామీర్ పేట మం డలంలో అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లను, పంచాయతీ సిబ్బందిని కలిపి మొత్తం 76 మందిని ఎమ్యూనరేటర్లుగా నియమించినట్లు, వారికి సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించడానికి 81 బ్లాక్ లుగా విభజించి ఏర్పాటు చేసినట్లు, ఒక్కో ఎమ్యూనరేటర్ 150 ఇళ్ళకు వెల్లి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్వర్తించాలని వివరించారు.తూంకుంట మున్సిపల్ లో....శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ వెంకటగో పాల్ ఆధ్వర్యంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎమ్యూనరేటర్లకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని ప్రాంతాలకు నియామకమైన ఎమ్యూనరేటర్లు బాధ్యతగా ప్రతి ఇంటింటికి వెల్లి కుటుంబ సభ్యులను కలసి సమగ్రంగా కుటుంబ సర్వేను నిర్వర్తించాలని మున్సిపల్ కమీషనర్ ఎమ్యూనరేటర్లకు తెలిపారు. సర్వే ఫారాలలో కుటుంబీకుల వివరాలను సక్రమంగా పొందపరచాలని కమీషనర్ ఎమ్యూనరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సూపరవైజర్లు, సిబ్బంది, ఎమ్యూనరేటర్లు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జ్ స్కూల్ విద్యార్థి స్కంధవి ఎంపిక




శామీర్ పేట, (గరుడ వార్త) రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జ్ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లుగా ఆ పాఠశాల ప్రిన్సిపల్ స్వాతిభట్టాచార్య బుధవారం తెలిపారు. ఈ నెల 29 న జడ్పీహెచ్ఎస్ ఉప్పల్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో శామీర్ పేట మండలం మజీద్ పూర్ పరిధిలోని జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జ్ పాఠశాలకు చెందిన మేడోజి స్కంధవిప్రతిభ కనబరిచి అండర్ 14 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఎంపికైన మేడోజి స్కంధవిని పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతిభట్టాచార్య, ఉపాధ్యాయులు, పీఈటీలు వెంకటేష్, రాజశేఖర్ లు అభినందించారు.

## పర్యావరణహిత అడుగులు



కరీంనగర్ : పర్యావరణ హితం కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహాలం దిస్తున్నాయి.. పెరుగుతున్న కాలుష్యం, భారంగా మారిన ఇంధన ధరలు తదితర కారణాలతో వాహనదారులూ వాటి వైపు మొగ్గు చూపుతున్నారు.. ఈ క్రమంలో ఈవీ కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల విక్రయాలు పెరగ్గా అదే స్థాయిలో ఛార్జింగ్ కేంద్రాలు లేకపోవడం మాత్రం సమస్యగా మారింది. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 7,565 ఎలక్ట్రిక్ వాహనాలు ఆయా ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయి. 2020లో 46 ఎలక్ట్రిక్ వాహనాలు ఉండగా, 2021లో వాటి సంఖ్య 532కు చేరుకోగా ప్రస్తుతం 7,565 ఉండటం గమనార్హం. వీటిలో ద్విచక్ర వాహనాలే ఎక్కువ. గ్రామాల్లోనూ ఈ-బైక్‌ల వినియోగం పెరిగింది. వీటిని కొనుగోలు చేసిన వారికి జీవితాల పన్నుతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం మినహాయింపునిస్తూ ప్రోత్సహిస్తోంది. గడువు ముగిసిన వాహనాలను తుక్కు కింద మార్చి ఆ సర్టిఫికెట్ చూపిస్తే దానిపై కూడా కొంత వరకు రాయితీ లభిస్తుంది.

సమస్యలున్నాయి..

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్నా ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేవు. ప్రభుత్వ పరంగానూ ఏర్పాటు చేయలేదు.

ప్రస్తుతమున్న ఈవీ కార్లలో చాలా వాటి బ్యాటరీ సామర్థ్యం తక్కువ. వాహనదారుడు కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి రావాలంటే మధ్యలో ఛార్జింగ్ చేయించాల్సిందే. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో తీసుకెళ్లలేని పరిస్థితి. దీంతో ఎక్కువ మంది దూర ప్రాంతాలకు ఇంధన వాహనాలను వినియోగిస్తూ సమీప ప్రాంతాలకు ఈవీలు ఉపయోగిస్తున్నారు. సాధారణ వాహనాలతో పోల్చుకుంటే ఖరీదు ఎక్కువగా ఉండటం, బ్యాటరీ జీవితకాలం పూర్తయితే కొత్తది మార్చుకోవడానికి అధిక ధర వెచ్చించాల్సి రావడం చాలా మందిని వెనుకడుగు వేసేలా చేస్తోంది. ఈవీ కారు యజమానులు ఇంటి వద్దే తమ వాహనాలను ఛార్జింగ్ చేసుకుంటున్నారు. ఛార్జింగ్ కోసం ఆయా కంపెనీలు ప్రత్యేక పరికరం ఇస్తున్నాయి.సొంత ఇల్లు ఉన్నవారికి అయితే ఛార్జింగ్ పాయింట్ కోసం ఇంటి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసుకోవచ్చు. అద్దెకు ఉన్న వారికి మాత్రం ఇది ఇబ్బందిగా మారింది. ఇంటిలో పై అంతస్తులో ఉన్నవారిదీ ఇదే పరిస్థితి.అక్కడక్కడ ఉన్నా....ఈవీ వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో కొందరు హోటళ్లు, షోరూంల వద్ద ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. వాహనం ఛార్జింగ్ కావడానికి సమయం ఎక్కువగా తీసుకుంటుంది. దీంతో హోటళ్లు, షోరూంల వద్ద గంటల కొద్దీ ఉండటానికి ఎవరూ ఇష్టపడటం లేదు. ఇలా చేస్తే మేలు..ఛార్జింగ్ స్టేషన్లను విరివిగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

బ్యాటరీల సామర్థ్యం పెంచేలా, ఛార్జింగ్ సమయం తగ్గించేలా కంపెనీలకు సూచనలివ్వాలి.

## యూడైస్ ప్లస్ ప్రారంభం

సిరిసిల్ల : రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు ఆయా పాఠశాలల యూడైస్ ప్లస్ పోర్టల్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్)లో నమోదు ప్రారంభమైంది. పాఠశాలల్లోని వసతులు, ఇతర వివరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల నమోదు చేపడుతున్నారు. పాఠశాలకు సంబంధించిన లాగిన్‌లో యూడైస్ కోడ్ నమోదు చేసి వివరాలను పొందుపరుస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా బడులకు బడ్జెట్ కేటాయించడంతోపాటు వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లుల కేటాయింపునకు అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను ఇది వరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గత సంవత్సరం వరకు యూడైస్‌గా కొనసాగగా, దానిని యూడైస్ ప్లస్‌గా నవీకరించారు. ప్రతి 3 గంటలకు ఒకసారి సాంకేతికత ఆధారంగా సమాచారం నవీకరించడం దీని ప్రత్యేకత. ఈ వెబ్‌సైట్‌లో పాఠశాల భౌతిక వనరులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. క్రీడా స్థలం, తరగతి గదులు, ఇంకా కావాల్సిన గదులెన్ని, అవసరమైన వసతులు వంటి వివరాలను ఎప్పటికప్పుడు అందులో పొందుపరుస్తున్నారు.

ప్రతి విద్యార్థికి 'పెన్'

యూడైస్ ప్లస్‌లో నమోదు చేసిన ప్రతి విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశ వ్యాప్తంగా ఏయే పాఠశాలల్లో ఏయే తరగతులు చదివాడు అనేది కచ్చితంగా తెలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా యూడైస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగానే పాఠ్య పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, నోటుపుస్తకాలు పంపిణీ చేస్తుంది.

గత సంవత్సరం నుంచి 10వ తరగతి విద్యార్థుల నామినల్ రూల్స్ కోసం యూడైస్ డేటానే పరిగణనలోకి తీసుకొంటున్నారు.

ఉపాధ్యాయులకు జాతీయ కోడ్

విద్యార్థుల మాదిరిగానే ఉపాధ్యాయులకు కూడా ఒక జాతీయ కోడ్ (నంబర్)ను యూడైస్ కేటాయిస్తుంది. దీని ద్వారా ప్రతి పాఠశాలలో కచ్చితంగా నమోదయ్యే విద్యార్థుల సంఖ్యతో పాటు ఉపాధ్యాయుల సంఖ్య కూడా తెలుస్తుంది. దీని ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని లెక్కించవచ్చు. యూడైస్‌లో నమోదు కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయనున్నారు.

## ఆరంభంలోనే అలసత్వం!

చౌటుప్పల్ : హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌ల వద్ద జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) నివారణ చర్యలను చేపట్టిన సంగతి తెలిసిందే. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు 181.5 కిలోమీటర్ల పరిధిలో ఈ పనులను చేపట్టనున్నారు. ఈ రహదారిపై మొత్తం 17 ప్రాంతాల్లో ఒక ఫ్లైఓవర్, 13 అండర్‌పాస్ వంతెనలు, 10 చోట్ల సర్వీసు రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

వీటి టెండర్‌ను హరియాణాకు చెందిన సంస్థ రూ.282 కోట్లకు దక్కించుకొని చేపడుతుంది. జూన్ 23న చిట్యాలలో అండర్‌పాస్ వంతెనకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. తర్వాత చౌటుప్పల్, చిట్యాలలో అండర్‌పాస్ నిర్మాణ పనులను గుత్తేదారు సంస్థ ప్రారంభించింది. కానీ.. మిగతా చోట్ల ఎక్కడా పనుల జాడే లేదు. ఏడాదిలోపే బ్లాక్‌స్పాట్‌ల వద్ద పనులు పూర్తిచేయాలని ఎన్‌హెచ్ఏఐ, గుత్తేదారు సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే రెండు నెలలు గడిచినా పనుల ప్రారంభంలో వేగవంతం లేదు.

ఇక్కడ పనుల ఊసేలేదు..

కట్టంగూరు, నకిరేకల్, కేతేపల్లి, సూర్యాపేట, మునగాల, కోదాడ మండలాల్లోని పలు ప్రాంతాల్లో అండర్‌పాస్, సర్వీసు రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నారు. విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో అండర్‌పాస్ వంతెనకు రూ.20-40 కోట్లు, ఒక్కో సర్వీసు రోడ్డుకు రూ.3 నుంచి 8 కోట్లు



నిధులను కేటాయించారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడా ఇంకా పనుల ప్రారంభమే కాలేదు.

వర్షాలు తగ్గాక వేగవంతం..

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పనులకు ఆటంకం కలుగుతుంది. అందుకే పూర్తిస్థాయిలో గుత్తేదారు సంస్థ ఇంకా పనులను ప్రారంభించలేదు. వానలు తగ్గాక పనులు వేగవంతంగా నడుస్తాయి. చౌటుప్పల్‌లో చెరువు అలుగు పోస్తే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అందుకోసం తొలుత చౌటుప్పల్‌లో డ్రైనేజీ, సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలి. అనంతరం అండర్‌పాస్ పనులు ప్రారంభమవుతాయి.

నాగేశ్వర్‌రావు, పీడీ, ఎన్‌హెచ్-65

అసలు సమస్యలు ఇక్కడే..

చౌటుప్పల్‌లోని తహసీల్ కార్యాలయం దర్గా నుంచి భాస్కర్ థియేటర్ వరకు ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. దీనికి కొద్ది దూరం నుంచి వలిగొండ రోడ్డు దాటి పద్మావతి ఫంక్షన్‌హాల్ వరకు అండర్‌పాస్ వంతెనను నిర్మించనున్నారు. ఈ రెండింటికి సుమారు రూ.100కోట్ల వరకు ఖర్చవుతుందని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. చౌటుప్పల్‌లో జూన్ చివరి వారంలో పనులు ప్రారంభించినా.. వేగంగా అడుగులు పడటం లేదు. ప్రస్తుతం చెట్లు నరికే, వలిగొండ రోడ్డు సమీపంలో డ్రైనేజీ నిర్మాణం, రోడ్డు చదును పనులు మాత్రమే నడుస్తున్నాయి. అండర్‌పాస్ పనులను ప్రారంభించాలంటే మొదట సర్వీసు రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలి. జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను సర్వీసు రోడ్డు నుంచి రాకపోకలు సాగించేలా చూడాలి. ఇక్కడ సర్వీసు రోడ్డు పనులే పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. చిట్యాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

## గుట్టుగా గుట్కా దందా

భువనగిరి : పట్టణంలోని గంజ్ మార్కెట్‌లో మూడు దుకాణాల్లో గుట్టుగా సాగిస్తున్న గుట్కా దందాపై ఎస్వోటీ పోలీసులు ఈ నెల 10న దాడులు చేశారు. పెద్ద ఎత్తున నిల్వ చేసిన గుట్కా ప్యాకెట్ సంచులు పట్టుబడ్డాయి. ఓ వ్యాపారి వద్ద ఉన్న నాలుగు సంచులు సీజ్ చేశారు. వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.5లక్షల వరకు ఉంటుందని అంచనా. మరో ఇద్దరు వ్యాపారుల దగ్గర దాదాపుగా రెండు వేల ప్యాకెట్లు పట్టుబడ్డాయి.

పొగాకు ఉత్పత్తులు, గుట్కా విక్రయాలపై ప్రభుత్వ నిషేధం ఉన్నప్పటికీ జిల్లాలో గుట్కా విక్రయాలు గుట్టుగా సాగుతున్నాయి. పోలీసుల కళ్లుగప్పి కొంతమంది వ్యాపారులు భారీగా గుట్కాను అక్రమ మార్గంలో దిగుమతి చేసుకుని దందా కొనసాగిస్తున్నారు. ఏజెంట్లను నియమించుకుని పెద్దమొత్తంలో సరఫరా చేస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాకు గుట్కాను తరలిస్తున్నారు.

నిషేధం ఉన్నా.. నిరంతరం నిఘా ఉండే భువనగిరి పట్టణంలోని పోలీసుల కళ్లు గప్పి గుట్కా దందా సాగిస్తున్నారు. గంజ్‌మార్కెట్‌తో పాటు, ఇతర ఏరియాలకు రాత్రి వేళలో ఎక్కువగా గుట్కా సంచులు సరఫరా అవుతున్నాయి. భువనగిరి పట్టణంలో గతంలో ఈ వ్యాపారం చేసిన వారు పోలీసులకు అనుమానం రాకుండా ఇతరుల దుకాణాలలో సంచులను నిల్వ చేస్తున్నారు. భారీగా డబ్బులు వస్తాయనే ఆశతో వ్యాపారులు అక్రమ దందాకు మొగ్గుచూపుతున్నారు. అడపాదడపా పోలీసులు దాడులు చేసినా కొద్దిమొత్తం మాత్రమే సరకు దొరుకుతోంది. నిల్వ ఉంచి ఎవరికి అనుమానం రాకుండా పరిచయం ఉన్న వ్యక్తులకే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా అనుమానితులు గుట్కా అడిగితే లేదని చెబుతారు. వ్యాపారులకు తెలిసిన వారితో చెప్పిస్తే కానీ కొత్త వారికి అమ్మడానికి ముందుకు రారు. గుట్కా కేసుల్లో దొరికినా సులువుగా బయటికి వచ్చి మళ్లీ అదే వ్యాపారం కొనసాగిస్తున్నారు. రెండేళ్ల కిత్రంతో పోల్చితే గుట్కా కేసుల నమోదు తగ్గింది. భువనగిరి పట్టణంతో పాటు జిల్లాలోని ఇతర మండల కేంద్రాల్లో కూడా గుట్కా వ్యాపారం సాగుతోంది.

పట్టణంలోని హోల్‌సేల్ దుకాణాదారుల దగ్గర గ్రామాల్లో ఉండే చిరు వ్యాపారులు, పాన్, టీ దుకాణాదారులు సరకు తెచ్చుకుని బహిరంగంగానే అమ్ముతున్నారు.

నిఘా పెంచాంనిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కా వ్యాపారంపై నిఘా పెంచాం. సమాచారం మేరకు దాడులు చేసి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. పట్టుబడిన కేసుల్లో జిల్లాకు సరఫరా చేసే ఏజెంట్లపై నిఘా ఉంచాం. విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలి. రవికిరణ్‌రెడ్డి, ఏసీపీ, భువనగిరి

# కేంద్రాల్లో వసతుల్లేవు... తూకాలు ప్రారంభం కావు

ఎల్లారెడ్డిపేట : వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. మిల్లర్లతో ప్రభుత్వ ఒప్పందం ఓ కొలిక్కిరాకపోవడం వల్ల ఎక్కడా తూకాలు ప్రారంభం కాలేదు. వరి కోతలు ఊపందుకుంటున్న నేపథ్యంలో భారీ ఎత్తున ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తున్నారు. పంటను ఆరబెడుతూ రేయింబవళ్లూ పడిగాపులు పడుతున్నారు. మరోవైపు కేంద్రాల్లో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నిరీక్షించే ఓపిక లేక చాలా మంది దళారులకు విక్రయిస్తున్నారు.

**కాపాడుకునేందుకు కాపలా**

కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో రాత్రిపూట ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు కేంద్రాల్లోనే నిద్రించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

ఎల్లారెడ్డిపేట మండలంలో ఇప్పటి వరకు 10 కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో కనీసం తాగునీరు లేక ధాన్యాన్ని ఆరబెట్టే అన్నదాతల గొంతెండుతుంది.

నీడ కోసం సమీపంలోని చెట్ల కిందకు పరుగు పెడుతున్నారు.

విద్యుత్తు సౌకర్యం లేక చీకటిపూట నానా తంటాలు పడుతున్నారు. గతంలో పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల నుంచి పలువురు రైతులకు చెందిన ధాన్యం రాత్రిపూట చోరీకి గురైన సంఘటనలు ఉన్నాయి. దీంతో రాత్రి పూట కేంద్రాల్లోనే నిద్రిస్తున్నారు.

తాత్కాలిక మూత్రశాలలు లేకపోవడం ముఖ్యంగా మహిళా రైతులకు ఇబ్బందిగా మారింది.

**తూకాలకు ఎదురుచూపులు**

కోనరావుపేట: కేంద్రాల్లో రైతులు ధాన్యం పోసి 20 రోజులు కావస్తున్నా కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. తేమశాతం వచ్చినప్పటికీ తూకం వేయటం లేదు. దీంతో కొందరు రోజుల తరబడి నిరీక్షించలేక వ్యవసాయ క్షేత్రాల వద్దనే క్వింటా రూ.1,850 నుంచి రూ.2,150లకు



విక్రయిస్తున్నారు.

జిల్లాలో వరి సాగు : 1.56 లక్షల ఎకరాలు

ధాన్యం దిగుబడి అంచనా : 4.37 లక్షల మెట్రిక్ టన్నులు

సేకరణ లక్ష్యం : 3.0 లక్షల మెట్రిక్ టన్నులు

మొత్తం కొనుగోలు కేంద్రాలు : 258

**కొనుగోళ్లు ప్రారంభించక...**

మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో నీడ, తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు లేవు. రైతులు ఇళ్ల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. చెట్ల నీడన సేదతీరుతున్నారు.

**తూర్పార పట్టే యంత్రాలు ఏవి?**

వేములవాడ గ్రామీణ మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ తూకం వేయడం లేదు. కోనాయపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన కేంద్రంలో ధాన్యం తూర్పార పట్టడానికి యంత్రాలు సరిపడా లేవు. ఒక్క యంత్రాన్ని మాత్రమే అందుబాటులో ఉంచారు.వట్టింల, నూకలమర్రిలో టార్పాలిన్లు అందుబాటులో లేవు. రైతులే కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. విద్యుత్తు సదుపాయం లేక రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నారు.

**అడవి జంతువుల బెడద**

మండలంలో కేంద్రాలన్నీ అడవికి సమీపంలోనే ఉండటంతో వన్యప్రాణుల బెడద ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళల్లో ధాన్యం రాశులపై దాడి చేస్తున్న ఘటనలు ఏటా చోటుచేసుకుంటాయి. విద్యుత్తు, నీడ, నీటి సదుపాయాలు లేవు.

**టార్పాలిన్లు లేక...**

కొదురుపాకలోని కేంద్రంలో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. నీడ కోసం చెట్టు కింద పందిరి వేశారు. తాగు నీటి సదుపాయం కల్పించలేదు. ప్యాడీ క్లీనర్ లేదు. స్థలం సరిపోక ఆర్అండ్ఆర్ కాలనీలోని సీసీ రహదారులపై ధాన్యం పోసుకుంటున్నారు.

అందుబాటులో పరికరాలు జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలకు సరిపడా ప్యాడీ క్లీనర్లు, తేమశాతం చూసే పరికరాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్రాలు ప్రారంభించిన వారు మార్కెట్ కార్యాలయానికి వచ్చి తీసుకెళ్తున్నారు. ఇంకా కొన్ని కేంద్రాల వారు తీసుకెళ్లాల్సి ఉంది. ఐకేపీ, పీఏసీఎస్, మార్కెటింగ్ శాఖల కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని నిర్వాహకులను కలెక్టర్ ఇది వరకే ఆదేశించారు. కేంద్రాల వారీగా పరిశీలిస్తూ వసతులపై సూచనలు చేస్తున్నాం. ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

# చిన్నారులతో అక్షరాలు దిద్దించేదెవ్వరు?

శంకరపట్నం : శంకరపట్నం మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేకపోవటంతో చిన్నారులకు అక్షరాలు దిద్దించే వారు కరవయ్యారు. మండల వ్యాప్తంగా మొత్తం 47 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కేశవపట్నం సెక్టార్ పరిధిలో 27 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను అయిదు కేంద్రాలలో అయిదుగురు టీచర్లు, ఆరు సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగట్టు సెక్టార్ పరిధిలో 22 కేంద్రాలకు మెట్‌పల్లి అయిదో అంగన్‌వాడీ కేంద్రం, లింగాపూర్ ఒకటో కేంద్రంలో టీచర్లు, 13 మంది సహాయకులు లేరు. టీచర్లు, ఆయాల కొరతతో చిన్నారులను కేంద్రాలకు తల్లిదండ్రులే తీసుకొస్తున్నారు. ఆయా కేంద్రాలకు అంగన్‌వాడీ టీచర్లు లేకపోవటంతో తల్లిదండ్రులు చిన్నారులను పంపించడానికి వెనుకంజ వేస్తున్నారు. దీంతో చిన్నారులు, గర్భిణుల సంఖ్య నమోదుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యపై అంగన్‌వాడీ పర్యవేక్షకులు స్రవంతి, కవితలను వివరణ కోరగా.. ఖాళీల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. కేంద్రాలలో టీచర్ల సమస్యతో ఇబ్బందులు వాస్తవమేనని పేర్కొన్నారు.

# రుడాకు పచ్చజెండా జిల్లాకు మహర్దశ



గోదావరిఖని : అందరూ ఊహించినట్టుగానే రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో జిల్లాకు మహర్దశ చేకూరనుంది. పట్టణీకరణ వేగం కానుంది. అలాగే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సైతం పెరగనున్నాయి. ఏకంగా జిల్లా రూపురేఖలు మారే అవకాశం ఏర్పడింది.

ప్రత్యేక నిధులతో.. రుడాతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగపడనున్నాయి. రహదారులతోపాటు విద్యుద్దీకరణ, నీటి సౌకర్యం మరింత మెరుగయ్యే అవకాశం ఉంది. దీంతో గ్రామాలన్ని పట్టణీకరణ దిశగా అడుగులు వేయనున్నాయి. రుడాతో గ్రామ పంచాయతీలు కొనసాగుతూనే పట్టణీకరణకు విడుదలయ్యే ప్రత్యేక నిధులను కూడా వెచ్చించుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రాంతంలో చెల్లించే పన్నులను కూడా స్థానికంగా ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. దీంతోపాటు కొన్ని పట్టణాలు బీ-కేటగిరి నగరాలుగా గుర్తించే అవకాశం ఉంటుంది.

పరిశ్రమలతో మరింత అభివృద్ధిజిల్లా మొత్తం రుడాగా మారడంతో వేగంగా అభివృద్ధి జరిగే అవకాశం ఉంది. జిల్లాలోని భారీ పరిశ్రమలతో మరింత ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. జిల్లాలో ఉన్న సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, జెన్‌కో, కేశోరాం సిమెంటు ఫ్యాక్టరీలతోపాటు రైసు మిల్లుల ద్వారా పన్నులు భారీగానే రానున్నాయి. వీటిద్వారా వచ్చే పన్నులను రుడా ప్రాంతంలో ఖర్చు చేసుకునే అవకాశం ఉంది. ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతోపాటు పరిశ్రమల పన్నుల ద్వారా చేకూరే నిధులతో జిల్లా రూపురేఖలు మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.

జిల్లాను రామగుండం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ(రుడా)గా ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ కూడా కాంగ్రెస్ హయాంలోనే ఏర్పడిందని గుర్తుచేశారు. ఎన్నికలముందు ఇచ్చిన హామి మేరకు రుడా ఏర్పాటుకు జీవో విడుదల చేయించామని పేర్కొన్నారు.

**14 మండలాలు**

జిల్లాలోని రామగుండం, అంతర్గాం, పాలకుర్తి, పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని, ధర్మారం మండలాలు రుడా పరిధిలో ఉండనున్నాయి. జిల్లాలో మొత్తం 14 లక్షల వరకు జనాభా ఉంది. జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులను కూడా ఎక్కువ స్థాయిలో విడుదల చేసే అవకాశం ఉంది.

**3 పురపాలికలు.. 198 గ్రామాలు**

జిల్లాలోని మూడు పురపాలక సంఘాలు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని.. రామగుండం నగరపాలకతోపాటు 14 మండలాలను కలుపుతూ రుడాగా ఏర్పాటు చేశారు. జిల్లాలోని 198 గ్రామాలు దీని పరిధిలోకి రానున్నాయి. పట్టణీకరణను వేగవంతం చేసేందుకు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ కింద నిధులు వెచ్చించేందుకు రుడా ఎంతో ఉపయోగపడనుంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలయ్యే ప్రత్యేక నిధులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు జిల్లాను రుడాగా మార్చాలని ప్రతిపాదనలు చేసిన మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్ ఆదివారం జీవో విడుదల చేశారు. జిల్లా జనాభాను ప్రాతిపదికన తీసుకుని రుడాగా మార్చిన ప్రభుత్వం ఇందులోని గ్రామాలను పట్టణీకరణ దిశగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం జగిత్యాల జిల్లా పరిధిలోకి వెళ్లిన ఎండపల్లి మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండెడ గ్రామాలను కూడా రుడా పరిధిలోకి తీసుకున్నారు.

# వైద్య నిపుణుల పల్లె బాట



పెద్దపల్లి : ప్రజలకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా స్థానికంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆశ్రయిస్తారు. అక్కడ మాత్రలు తప్ప సేవలు అంతంత మాత్రమే. వ్యాధి తీవ్రమైతే అప్పోసప్పో చేసుకొని పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు. కొందరు జిల్లా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఇక ఇలాంటి వెతలు దూరం కానున్నాయి. స్థానిక ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్య నిపుణుల చికిత్స అందనుంది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు ఇక పల్లె బాట పట్టనున్నారు. జిల్లాలో 18 ప్రాథమిక, 7 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 బస్తీ దవాఖానాలు, 66 పల్లె, 104 ఉప వైద్య కేంద్రాల్లో సేవలు అందుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోకి వెళ్లేందుకు వైద్య నిపుణుల వివరాలు సేకరణ తుది దశకు చేరింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కీలక విభాగాల వైద్య నిపుణులతో మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు పట్టణాలకు వెళ్లకుండా వ్యయ ప్రయాసలు తప్పనున్నాయి. వైద్య నిపుణులకు సరిపడా మందులు సమకూర్చితేనే పేదలకు మరింత మేలు చేకూరనుంది.

**అమలు ఇలా..**

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, బస్తీ దవఖానాలకు ప్రభుత్వ వైద్య నిపుణులు వెళ్తారు.

తొమ్మిది అంశాలకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు.

వ్యాధి తీవ్రత ఎక్కువ ఉంటే సమీపంలోని జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులకు పంపిస్తారు.

ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో వారంలో మూడు రోజులు సోమ, మంగళ, గురువారాల్లో కీలక విభాగాల వైద్య నిపుణులు వెళ్లి సేవలందించనున్నారు.

వైద్య నిపుణుల సేవలపై జిల్లా స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది. ఎంత మందిని పరీక్షించారో నివేదికలను తెప్పించుకోనున్నారు.

**పేదల వద్దకు మెరుగైన వైద్యం**

జిల్లాలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వైద్య నిపుణులు వెళ్లి చికిత్స అందించనున్నారు. జిల్లా ఆసుపత్రి, ప్రాంతీయ ఆసుపత్రుల్లోని వైద్య నిపుణుల వివరాలు సేకరిస్తున్నాం. పేదలకు తొమ్మిది రకాల వైద్య సేవలు అందుతాయి. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

**వైద్య నిపుణులు వీరే**

మహిళా వైద్య నిపుణులు

చిన్న పిల్లల వైద్యులు

జనరల్ ఫిజీషియన్

ఎముకలు, కీళ్ల సర్జన్

మానసిక వైద్య నిపుణులు

దంత నిపుణులు ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు)


# అరకొర వసతులు అడ్డగోలు వసూళ్లు

కరీంనగర్ : కరీంనగర్‌లోని ఓ కాలనీలో 200 చ.మీ.ల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకుంటే ఏటా నగరపాలక సంస్థకు రూ.4,650 ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అదే భవనాన్ని అద్దెకు ఇస్తే పన్ను రూ.6,975 చెల్లించాలి. కరీంనగర్‌లో నిర్మాణ ప్రదేశం, అంతస్తులను బట్టి అధికారులు పన్ను వసూలు చేస్తున్నారు. నగరానికి ఆనుకొని ఉన్న కొత్తపల్లి పురపాలికలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి. 150 చ.మీ.ల పరిధిలో రెండంతస్తుల ఇల్లు నిర్మించుకున్న యజమాని ఏడాదికి రూ.11 వేలు చెల్లించాల్సి వస్తోంది. అదే 100 చ.మీ.ల పరిధిలోని ఇంటికి రూ.5,300 చెల్లించాలంటున్నారని వాపోతున్నారు. కరీంనగర్ కార్పొరేషన్ కన్నా ఎక్కువ పన్ను వసూళ్లపై పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సుల్తానాబాద్ పురపాలికలో ఏడాది కిందట నిర్మించిన 200 చ.మీ.ల భవనానికి ఆస్తి పన్ను రూ.25 వేలు చెల్లించాలని ఇటీవల బల్దియా నుంచి లేఖ రావడంతో యజమాని కంగుతిన్నారు. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లో కూడా లేని పన్ను సుల్తానాబాద్‌లో ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. పన్ను భారం తగ్గించాలంటూ పట్టణానికి చెందిన దాదాపు 200 మంది నెల రోజుల కిందట మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించారు.

జగిత్యాల జిల్లా రాయికల్, ధర్మపురి బల్దియాల్లోనూ ఇంటి పన్నుల భారం స్థానికులకు ఆందోళన కలిగిస్తోంది. పంచాయతీల నుంచి పురపాలికలుగా మారినప్పటి నుంచి ఎక్కువ పన్ను చెల్లించాల్సి వస్తోందని యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పాటైన అన్ని పురపాలికల్లో ఇదే పరిస్థితి ఉండటంతో ఆవేదన చెందుతున్నారు.

2019లో ఏర్పాటైన కొత్త పురపాలికల్లో విలీనమైన గ్రామాల్లోనూ ఇదే ఆవేదన వినిపిస్తోంది. పంచాయతీగా ఉన్నప్పుడు ఏడాదికి రూ.800-1000 చెల్లించిన ప్రాంతంలోనే ప్రస్తుతం కొత్త ఇళ్లతో పాటు పాత వాటికి కట్టాల్సిన మొత్తం మూడింతలు పెరిగింది. వసతుల పరంగా ఎలాంటి పురోగతి లేకున్నా చెల్లించాల్సిన పన్ను ఇంత భారీగా పెరగడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2019లో ఏర్పాటైన కొత్త పురపాలికల్లో అక్కడి భూమి మార్కెట్ విలువ ఆధారంగా ఆస్తి పన్ను మదింపు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ గుర్తించిన భూముల ధరలను బట్టి బల్దియాలు పన్ను నిర్ణయిస్తూ తీర్మానాలు చేశాయి.



కొత్తపల్లి, చొప్పదండి, రాయికల్, ధర్మపురి, సుల్తానాబాద్, మంథని పట్టణాల్లో పాత పురపాలికల కన్నా ఎక్కువగా ఆస్తి పన్ను చెల్లించాల్సి వస్తోంది. పాత మున్సిపాలిటీలకు గతంలో ఉన్న గెజిట్ ప్రకారం చదరపు మీటరు ఆధారంగా పన్ను రేటు నిర్ణయించారు. ఇందులో ప్రాంతాన్ని బట్టి జోన్‌లుగా విభజించారు. కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలతో పాటు హుజూరాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల, వేములవాడ, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, పెద్దపల్లి పట్టణాల్లో అద్దె (రెంటల్) విలువ ప్రకారం ఆస్తి పన్ను వేస్తున్నారు. కొత్త పురపాలికల్లో మాత్రం క్యాపిటల్ విలువను నిర్ణయిస్తున్నారు. ఇక్కడ నివాస గృహాలకు భూమి మార్కెట్ విలువలో 0.1 నుంచి 1 శాతం వరకు, వాణిజ్య భవనాలకు 0.2 నుంచి 2.5 శాతం వరకు రుసుమును నిర్ణయించే అధికారం పురపాలికలకుంది. దీని ఆధారంగానే గతంలో చేసుకున్న తీర్మానాల ప్రకారం పన్ను వసూలు చేస్తున్నారు.

అన్ని చోట్లా ఒకే పద్ధతితో మేలు నాలుగు జిల్లాల్లోని బల్దియాల్లో మొత్తం 2,92,652 ఇళ్లుండగా ఏటా సుమారు రూ.81.19 కోట్ల ఆస్తి పన్ను వసూలవుతోంది. ఇందులో కొత్తగా ఏర్పాటైన ఆరు పురపాలికల్లో మొత్తం 27,831 నివాస గృహాలున్నాయి. ఈ పట్టణాల్లో 2020 నుంచి భువన్ యాప్ ద్వారా ఇంటి కొలతలను శాటిలైట్ విధానంతో తీస్తున్నారు. ఈ విధానంతో పాటు మార్కెట్ విలువ ఆధారంగా రుసుము నిర్ణయించే తీరు మార్చాలంటూ ప్రజలు పలుమార్లు పురపాలిక శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలిచ్చారు. మంత్రుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. పెరిగిన అదనపు భారాన్ని తగ్గించేలా అన్ని చోట్ల ఒకే పద్ధతి ఉండేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# రేషన్ దందా.. మహా దర్జా

మంథని : అధికారుల నిఘా లేకపోవడంతో నిత్యం టన్నుల కొద్దీ రేషన్ బియ్యం సరిహద్దులు దాటుతోంది. మంథని నియోజకవర్గం నుంచి మహారాష్ట్రకు దందా యథేచ్ఛగా సాగుతోంది. స్మగ్లర్లు గ్రామాల్లోని దుకాణాల నుంచి సేకరించి వివిధ మార్గాల్లో పొరుగు రాష్ట్రానికి తరలిస్తున్నారు. అధికారులు తనిఖీల్లో రేషన్ డీలర్ల వద్ద బియ్యం అక్రమ నిల్వలను గుర్తిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసినా జరిమానాతో సరిపెడుతూ దుకాణాల నిర్వహణకు అనుమతులు ఇస్తుండటంతో అక్రమాలకు తెర పడటం లేదు.

**ఏడు నెలల్లో 400 క్వింటాళ్లు**

మంథని ప్రాంతంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ నెల వరకు అక్రమంగా తరలిస్తున్న 400 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఏప్రిల్‌లో మంథని బస్సు డిపో వద్ద 25 క్వింటాళ్లు, అక్కడికి సమీపంలో 28 క్వింటాళ్లు, మే నెలలో సిరిపురంలో 35 క్వింటాళ్లు, మంథని లైన్‌గడ్డ, గంగాపురిలో 60 క్వింటాళ్లు, జూన్‌లో ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌లో 125 క్వింటాళ్లు, ఆగస్టులో సిద్దపల్లిలో 5, ముత్తారంలో 25 క్వింటాళ్లు, సెప్టెంబరులో నాగారంలో 48 క్వింటాళ్లు, ఈ నెల 22న ముత్తారం మండలం పోతారంలో 4, మంథని పట్టణంలోని ఓ రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న 55 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం స్మగ్లర్ల మధ్య సయోధ్య లేక అధికారులకు సమాచారం ఇస్తూ ఒకరి బియ్యాన్ని మరొకరు అధికారులకు పట్టిస్తున్నట్లు తెలిసింది.

**నిఘా పెంచి అక్రమాన్ని అరికడతాం**



మంథని ప్రాంతం నుంచి బియ్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం, రాత్రి వేళ నిఘా పెంచి తరలింపును అడ్డుకుంటాం. తరచూ రేషన్ దుకాణాలు తనిఖీ చేసి, నిల్వలను పరిశీలిస్తాం. రాజేందర్, పెద్దపల్లి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

**వయా సుందిల్ల బ్యారేజీ**

మంథనిలో పౌర సరఫరాల గోదాం నుంచి ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి, మంథని మండలాల్లోని 93 రేషన్ దుకాణాలకు ప్రతి నెలా దాదాపు 6,500 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది.

బియ్యం వద్దనుకుంటున్న లబ్ధిదారుల నుంచి డీలర్లు కిలోకు రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. బదులుగా కిరాణా సామగ్రి అప్పగిస్తున్నారు. అదే బియ్యాన్ని స్మగ్లర్లకు కిలోకు రూ.12 చొప్పున విక్రయిస్తున్నారు. అలా సేకరించిన బియ్యాన్ని దళారులు ఒకచోట నిల్వ చేసి టోకున మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు.

స్మగ్లర్లు బియ్యాన్ని కమాన్‌పూర్, రామగిరి మండలాల మీదుగా సుందిల్ల బ్యారేజీ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

మరోవైపు మంథని మండలం ఎగ్లాస్‌పూర్ చెక్‌పోస్టు మార్గానికి ప్రత్యామ్నాయంగా మంథని మండలం నుంచి ఖమ్మంపల్లి, తాడిచెర్ల, కొయ్యూరు, కాళేశ్వరం వంతెన మీదుగా రవాణా చేస్తున్నారు.

మహారాష్ట్రలోని సిరొంచ రైస్ మిల్లులో బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద తిరిగి మంథనికి పంపిస్తున్నారు. ఏడాది కిందట సిరొంచ నుంచి మంథని మండలం గద్దలపల్లి మిల్లుకు తరలిస్తున్న రెండు లారీల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.

# నైపుణ్యముంటే.. ఉపాధి వెంటే!

ఖమ్మం : యువతలో నైపుణ్యం పెంచి మెరుగైన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్కిల్స్ యూనివర్సిటీలో వచ్చే నెల నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రవేశాలకు ఈనెల 29న తుది గడువుగా నిర్ణయించింది. అధికారిక వెబ్‌సైట్ %www.yisu.in% లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ కోర్సులకు అర్హులైన అనేక మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నారు. రేపటితో గడువు ముగియనున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో కోర్సు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికీ కచ్చితంగా ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక తయారు చేసింది. ఈ యూనివర్సిటీలో నైపుణ్యం పెంచుకుంటే సత్వరం కొలువు లభించే అవకాశం ఉంటుంది. మొత్తం 17 రంగాల్లో ప్రతి సంవత్సరం 20 వేల మందికి ఉపాధి కల్పించటం లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ సంస్థలో తొలి బ్యాచ్‌కు 2 వేల మందిని ఎంపిక చేయనున్నారు. ఈ ఏడాది మూడు రంగాల్లో నాలుగు కోర్సులను ప్రారంభిస్తున్నారు. ఔషధ, ఆరోగ్య సంరక్షణ, సరకు నిల్వ రంగాల్లో నాలుగు స్వల్పకాలిక కోర్సులకు అనుమతి లభించింది. ఈ కోర్సులకు సంబంధించి విస్తృత ప్రచారం లేకపోవడంతో చాలామంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు.

**స్వల్పకాలిక కోర్సులు**

స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్: ఈ కోర్సులో నర్సింగ్ ఎక్సలెన్స్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం చేసేందుకు జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెల్సీ నర్సింగ్, పోస్ట్‌బేసిక్ నర్సింగ్ చదివిన వారు అర్హులు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి. కోర్సు కాల వ్యవధి 3 నెలలు.

స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్: ఇందులో అసోసియేట్ ప్రోగ్రాంను బీఎస్సీలో రసాయనశాస్త్రం ఒక సబ్జెక్టు కలిగి ఉన్న వారు ఎంచుకోవచ్చు. కోర్సు కాల వ్యవధి ఆరు నెలలు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు నెలకు రూ.17,500 ఉపకార వేతనం ఇస్తారు.


స్కూల్ ఆఫ్ లాజిస్టిక్, ఈ-కామర్స్‌లో వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ సర్టిఫికెట్ ప్రోగ్రాం: కోర్సు కాల వ్యవధి మూడున్నర నెలలు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 18 నుంచి 26 సంవత్సరాల లోపు వారు అర్హులు. కోర్సు ఫీజు రూ.12 వేలు.

# పాడి పశువులెన్ని.. గుర్రాలున్నాయా!?

సిరిసిల్ల : పశుగణన కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించడానికి పశుసంవర్ధకశాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. నాలుగు నెలల పాటు నిర్వహించనున్న ఈ గణనలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు, పిల్లులు తదితర జంతువులను వాటి జాతుల వివరాలతో పాటు కోళ్ల లెక్కను పక్కాగా సేకరించనున్నారు. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహణకు అంతా పూర్తి చేశారు. త్వరలో ప్రారంభించనున్నారు. దేశం మొత్తంలో ఎంత పశుసంపద ఉంది అనేది పశుగణన ద్వారా లెక్కిస్తారు.మాంసం, గుడ్లు ఉత్పత్తి, వాటి ద్వారా వచ్చే ఆదాయం ఎంత, దేశంలోని జనాభాకు ఇవి సరిపోతాయా, లేదా, దీనిని బట్టి ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం ఉందా, లేదా, ఇతర దేశాల నుంచి మనదేశానికి దిగుమతి చేసుకోవడం కోసం లెక్కలు వేసి, ప్రణాళికలు సిద్ధం చేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

**చరవాణిలో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని...**

పశుగణన కోసం జిల్లాలో ఎంపిక చేసిన ఎన్యూమరేటర్ల వివరాలను జిల్లా అధికారులు కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. పశుగణనకు సంబంధించిన 21వ లైవ్‌స్టాక్ సెన్సెస్ యాప్‌ను చరవాణిలో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. వెంటనే అతనికి యూజర్‌నేమ్‌తోపాటు పాస్‌వర్డ్ మెసేజ్ వస్తుంది. వాటిని నమోదు చేయగానే దాని కింది భాగంలో యూజర్‌నేమ్‌తో పాటు పాస్‌వర్డ్ ఉంటుంది. క్రియేట్ యువర్ న్యూ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ అని వస్తుంది. అప్పుడు ఎన్యూమరేటర్ నూతనంగా నమోదు చేయగానే ఆ యాప్ ఓపెన్ అవుతుంది. అప్పుడు వివరాల నమోదు ప్రారంభమవుతుంది. దీంతో ఏ ఒక్క ఎన్యూమరేటరు కూడా ఇతరుల యాప్‌ను ఓపెన్ చేయడానికి ప్రయత్నించినా, యూజర్ నేమ్‌గాని, పాస్‌వర్డ్‌గాని ఉపయోగించినా సంబంధిత ఎన్యూమరేటర్‌కు




తెలిసిపోతుంది. పశుగణన పూర్తి చేసిన తర్వాత వాటిని అప్‌లోడ్ చేయగానే సంబంధిత మండల సూపర్‌వైజర్‌కు, జిల్లా అధికారికి, అక్కడి నుంచి రాష్ట్ర, కేంద్ర అధికారులకు వెళతాయి. అధికారులు వారి స్థాయిలో పరిశీలించి ఆమోదించిన తర్వాతనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సమాచారం చేరుతుంది.

**ఒక్కొక్కరు 4,500 ఇళ్ల వివరాల నమోదు**

గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి పశువులతోపాటు ఇతర జంతువుల వివరాలను నమోదు చేయనున్నారు. ఇందుకు జిల్లాలో 51 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. వీరంతా పశువైద్య సిబ్బంది కావడం, పశువులపై పూర్తి అవగాహన ఉండటంతో వివరాలను యాప్‌లో తొందరగా నమోదు చేసే అవకాశం ఉంటుంది.

ఒక్కో ఎన్యూమరేటర్‌కు 4,500 ఇళ్లు కేటాయించారు. ఒకవేళ జిల్లాలో ఉన్న ఇళ్ల సంఖ్యకు వీరు సరిపోకపోతే ప్రైవేటుగా ఇతరులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చి గణన చేయించనున్నారు.

ప్రస్తుతం పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. ఈ ప్రక్రియ చివరి దశలో ఉంది. ఇది పూర్తయిన తర్వాత పశుగణన కార్యక్రమం ప్రారంభించనున్నారు.

21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం 2025 ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. గడువులోగా పూర్తి చేస్తాం21వ అఖిల భారత పశుగణనను ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తి చేస్తాం. దీనికోసం ఇప్పటికే ఎన్యూమరేటర్లతోపాటు మండల సూపర్‌వైజర్‌లు, జిల్లా స్థాయి అధికారులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. ఇది త్వరలోనే పూర్తవుతుంది. పూర్తయిన వెంటనే పశుగణన కార్యక్రమం ప్రారంభిస్తాం.రవీందర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

## కాళేశ్వరం డీపీఆర్‌ను కేసీఆర్ ఆమోదించారు: మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు



హైదరాబాద్: విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై విచారణ సాగింది. కాళేశ్వరం డీపీఆర్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించినట్లు విచారణ సందర్భంగా వెంకటేశ్వర్లు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన దస్త్రాలను కమిషన్‌కు అందించారు. కాళేశ్వరం డిజైన్లను ఫైనల్ చేయమని కేసీఆర్ చెప్పినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మినిట్స్‌కు సంబంధించిన దస్త్రాలు, మూడు బ్యారేజీల వివరాలను సమర్పించారు. మేడిగడ్డ కుంగుబాటుకు నిర్వహణ లోపమే కారణమా? మూడు బ్యారేజీల్లో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి అప్పటి ప్రభుత్వాధినేత ఆదేశించారని వెంకటేశ్వర్లు బదులిచ్చినట్లు సమాచారం.

# మానసిక కల్లోలం



హైదరాబాద్ : చాలామందిని చిన్న వయసులోనే మానసిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఎర్రగడ్డ మానసిక చికిత్స కేంద్రానికి నిత్యం పాత, కొత్త కలిపి 540 మంది వరకు ఓపీకి వస్తుండగా.. ఇందులో 18-30 ఏళ్లలోపు వారు దాదాపు 30-35 శాతం వరకు ఉంటున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. ఎక్కువ మంది కుంగుబాటు, ఆతృత, బైపోలార్ లాంటి సమస్యలకు లోనవుతున్నారు. తల్లిదండ్రుల తగాదాలు, ఒంటరి తనం, ప్రేమ వైఫల్యం తదితర కారణాలతో మత్తుకు బానిసలుగా మారి మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు.

ఉరుకుల పరుగులు జీవితంలో చాలా కుటుంబాల్లో పిల్లలను సైతం పట్టించుకోని పరిస్థితి. భార్యభర్తలు విడిపోవడం, పిల్లల ఎదుటే గొడవపడటం ఫలితంగా తాము ఒంటరి అనే భావనతో ఎక్కువ మంది యువత పక్కదారి పడుతున్నారు. ఇంటర్, డిగ్రీలోనే మత్తుకు బానిసలవుతున్నారు. మానసిక సమస్యలతో వచ్చే యువతలో ఎక్కువ మంది గంజాయి ఇతర మత్తు మందుల బాధితులేనని పేర్కొంటున్నారు. మానసిక సమస్యలకు సంబంధించి లక్షణాలు బట్టి ఔషధాలు ఇవ్వడంతోపాటు 6-8 వారాలపాటు కౌన్సిలింగ్ ద్వారా మానసిక చికిత్సలు చేస్తామని ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అనిత తెలిపారు.

**కొన్ని మానసిక సమస్యలు ఇలా... ఆతృత (యాంగ్జైటీ)**

ఆతృత అనేది ఆందోళన కలిగించే తీవ్రమైన భావన. తేలికపాటిగా, తీవ్రంగా...కొన్నిసార్లు భయాందోళన కలిగించే వివిధ స్థాయిలో ఉంటుంది. అనవసర భయాలు, భావోద్వేగ సమస్యలు, అనారోగ్యం, మత్తు పదార్థాలు తీసుకోవడం, లేనిది ఉన్నట్లుగా ఊహించుకోవడం. దెదడ, చంచలత్వం, భయం, ఎక్కువగా చమటలు పట్టడం, వికారం, అతిమూత్ర విసర్జన, నిద్రలేమి లక్షణాలు.

కౌన్సిలింగ్‌తో ఈ ఆతృత సమస్యను తగ్గిస్తారు. ఔషధాలు క్రమం తప్పకుండా వాడాలి. జీవనశైలిలో మార్పులు సైతం బాగా ఉపయోగపడతాయి.

**కుంగుబాటు (డిప్రెషన్)**

అంతర్లీనంగా ఉన్న దుఃఖంతో ఈ సమస్య ప్రారంభమవుతుంది. కారణం లేకుండా ఏడుస్తూ ఉంటారు. రెండు వారాలుగా బాధపడటం, అలసట, పనిలో ఆసక్తి తగ్గిపోవడం, ఆకలి మందగించడం, నిద్రలేమి లక్షణాలు ఉంటాయి.

కుటుంబంలో తగాదాలు, జన్యుపర అంశాలు, కొన్ని రకాల మందులు, వ్యసనాలు, బంధువులు, కుటుంబ సభ్యుల మరణం, దీర్ఘకాలిక అనారోగ్యాలు కుంగుబాటుకు ప్రధాన కారణాలు.

జీవనశైలిలో మార్పులు, వ్యాయామం, ఆహార ప్రణాళికలో మార్పులు, సరైన నిద్ర, ఆలోచనల్లో మార్పులు, ఆశావాద దృక్పథం, ఔషధాలు, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, ఇంటర్ పర్సనల్ థెరపీతో కుంగుబాటు నయం చేయవచ్చు.

**బైపోలార్ డిజార్డర్**

ఈ రుగ్మత కారణంగా మానసిక అసమతుల్యతలు విపరీతంగా ఉంటాయి. ఎక్కువ సంతోషం, అతిబాధతో కుంగిపోతుంటారు. చాలామందిలో ఈ రుగ్మత వారాలు లేదా నెలలు ఇంకా ఎక్కువ కాలమే ప్రభావం చూపుతుంది.

తనను తాను చాలా శక్తిమంతుడిగా భావిస్తుంటారు. అన్ని పనులు చాలా వేగంగా చేస్తారు. గొప్పగొప్ప ఆలోచనలు చేస్తూ...తాము ఏదైనా సాధిస్తామని చెబుతుంటారు. ఆచరణలో మాత్రం సాధ్యం కాదు. అసందర్భ ప్రేలాపనలతో మంచి చెడుల మధ్య విచక్షణ కోల్పోతారు. ఈ వ్యాధికి మందులు వైద్యుల సూచనలతో వాడాలి. సరైన కౌన్సిలింగ్, జీవనశైలి మార్పుతో సులువుగా సమస్య నుంచి బయట పడవచ్చు.

**స్కిజోఫినియాజి**

ఇది ఒక తీవ్రమైన మానసిక సమస్య. 1-2 శాతం మందిలో ఈ మానసిక రుగ్మత కన్పిస్తుంది. తనలోతాను నవ్వుకోవడం, మాట్లాడుకోవడం, తన ప్రపంచంలో తానే బతకడం, తనపై ఎవరో చేతబడి చేస్తున్నారని దృఢంగా నమ్మడం, ఎవరికి వినిపించని మాటలు తనకు వినిపించడం, ఒంటరిగా, మౌనంగా ఉండటం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు

ఆరంభ దశలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించడం చాలా అవసరం. మందులతోపాటు సైకోథెరపీతో వైద్యులు చికిత్స అందిస్తారు. క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవడం ద్వారా లక్షణాలను క్రమేపీ తగ్గించవచ్చని వైద్యులు తెలిపారు.

# అటకెక్కిన ఆపరేషన్ రోప్



హైదరాబాద్ : సీఎం ఆదేశించినా.. సీపీ హెచ్చరిస్తున్నా.. హైడ్రా రంగంలోకి దిగినా నగరంలో ట్రాఫిక్ కష్టాలు తీరడం లేదు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు, కార్యాలయాల నుంచి బయటకు వచ్చి రద్దీని అదుపుచేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు అమలుకు నోచుకోవట్లేదు. బంజారాహిల్స్, ఆబిడ్స్, చాదర్‌ఘాట్, సికింద్రాబాద్ వంటి ప్రధాన మార్గాల్లో అర్ధరాత్రి వరకు పాన్ దుకాణాలు, ఐస్‌క్రీమ్ పార్లర్ల బయట వాహనాలు నిలుపుతున్నా చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

సమన్వయలోపం.. రెండేళ్ల కిందట.. సమున్నత లక్ష్యంతో చేపట్టిన 'ఆపరేషన్ రోప్' అమలుకు నోచుకోవట్లేదని ఉన్నతాధికారులే అంగీకరిస్తున్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు 2022లో ఆపరేషన్ రోప్(రోడ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్) అమలుల్లోకి తెచ్చారు. రహదారి భద్రతే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం మంచి ఫలితాలనిచ్చింది. నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 2021లో 323 మంది మృతిచెందగా.. 2022లో 275, 2023లో 280 మంది.. ఇలా మృతుల సంఖ్య తగ్గటం ఆపరేషన్ రోప్ సానుకూల ఫలితాలకు నిదర్శనం. ఉన్నతాధికారుల మారడంతో లక్ష్యం అటకెక్కింది. సరిహద్దు కమిషనరేట్లు, రవాణా శాఖల అధికారులతో సమన్వయ లోపం సమస్యను మరింత జఠిలంగా మారుస్తోంది.

**ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లతోనే..**


మలక్‌పేట్ - ఎర్రగడ్డ, మాసబ్‌ట్యాంక్ - షేక్‌పేట్, మైత్రివనం-బేగంపేట్, సికింద్రాబాద్-తార్నాక పంజాగుట్ట-బంజారాహిల్స్ నిత్యం రద్దీగా ఉండే మార్గాలు. ఇలాంటి దారులకు ఇరువైపులా తోపుడుబండ్లు ఆక్రమించాయి. దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు నిలిపిన కార్లు, ద్విచక్ర వాహనాలతో నిండిపోతున్నాయి. దుకాణం ఎదురుగా ఉన్న పాదచారి మార్గాలను అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. 4లక్షలకు పైగా ఉన్న ఆటోలపై నియంత్రణ కొరవడింది. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఎస్సార్‌నగర్, అమీర్‌పేట్, మైత్రివనం ప్రాంతాల్లో కేవలం 2 గంటల తనిఖీల్లో 100కు పైగా ఆక్రమణలు తొలగించారు. అత్తాపూర్-మెహిదీపట్నం మార్గంలో రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న 350 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదుచేశారు. ఉల్లంఘనులను దారికి తీసుకొచ్చేందుకు తనిఖీల ప్రక్రియను నిరంతరం కొనసాగించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు అధిగమించాలని భావిస్తున్నారు.

# ప్రభుత్వోద్యోగుల పాఠశాల బాట

ఖమ్మం : ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఎంపికయ్యారు. జిల్లాలో సంక్షేమ గురుకుల విద్యాలయాలు, పంచాయతీ కార్యదర్శులు, పోలీసుశాఖలో పని చేస్తున్న కానిస్టేబుళ్లు, న్యాయశాఖతో పాటు ఇతర శాఖల్లో ఇప్పటికే పని చేస్తున్న సుమారు 100 మందికి పైగా ఉద్యోగులు ఆయా శాఖల నుంచి ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చినట్లు తెలుస్తోంది. భావి పౌరులను తయారు చేసి గురుతర బాధ్యతలపై ఎక్కువ మంది ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. రెండు మూడేళ్ల సర్వీసు సైతం వదులుకోవడం గమనార్హం.గురుకులాల నుంచి అత్యధికంగా..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఆధ్వర్యంలో జిల్లాలో పలు విద్యా సంస్థలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. గత ఏడాది వీటిలో రెగ్యులర్ ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సంస్థల్లో వందల సంఖ్యలో పరీక్ష రాసి ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులుగా నియమించారు. ఇవే సంస్థల్లో పని చేస్తున్న వందల మంది ఉపాధ్యాయులు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షలోనూ తమ సత్తాచాటి ఎంపికయ్యారు. ఇలా ఖమ్మం జిల్లాలో సుమారు 65 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 42 మంది ఎంపికైనట్లు సమాచారం. వీరంతా ప్రభుత్వం పాఠశాలల్లో చేరటంతో గురుకుల విద్యాలయాల్లో చాలా వరకు పోస్టులు ఖాళీ అయ్యాయి.

వేతనం ఎక్కువే...గురుకుల విద్యాలయాల్లో పని, వేతనం ఎక్కువే. గురుకులాల్లో టీజీటీ వేతనం ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌తో, పీజీటీ వేతనం జూనియర్ లెక్చరర్ వేతనం అంత ఉంటుంది. రెండు, మూడు ఇంక్రిమెంట్లు సైతం ఉంటాయి. గురుకులాల్లో బోధనతో పాటు బోధనేతర పనులు చేయాల్సి




ఉంటుంది. వరుసల వారీగా వారంలో రెండు మూడు రోజులు వార్డెన్ బాధ్యతలు నిర్వహించాలి. వీటికి తోడు పగలు, రాత్రి స్టడీ అవర్స్, సెలవు దినాల్లో విధులు, హౌస్ మాస్టర్, రాత్రి కేర్ టేకర్ బాధ్యతలు నిర్వహించాలి. రాత్రంతా విధులు నిర్వహించి ఉదయం 8.00 గంటల వరకు తిరిగి విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. బోధనతో పాటు అదనపు బాధ్యతల వల్ల మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు.

**అతిథి అధ్యాపకుల ఆవేదన..**

గురుకులాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకంతో గెస్ట్ లెక్చరర్లకు ఉద్వాసన పలికారు. ప్రస్తుతం డీఎస్సీతో ఖాళీలు ఏర్పడినందున తిరిగి విధుల్లో తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

# కుక్కల కు.ని.కి రూ.70 లక్షలా?

జగిత్యాల : జగిత్యాల పట్టణంలో కుక్కల బెడద నివారించేందుకు బల్దియా సాధారణ నిధులు రూ.70 లక్షలు కేటాయించింది. వార్డుల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్న కుక్కలను పట్టుకొని వాటికి కుటుంబ నియంత్రణ (కు.ని.) శస్త్రచికిత్స చేపట్టే కార్యక్రమం చేపట్టారు. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ బృందాన్ని నాలుగు నెలల క్రితం రప్పించారు. ఒక్కో కుక్కను పట్టుకొని కు.ని. అనంతరం వదిలేసేందుకు రూ.200, కు.ని.కి ముందు, తరువాత వాటి పర్యవేక్షణ, ఫీడింగ్ తదితరాల కోసం రూ.1,450 చొప్పున చెల్లించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు వార్డుల్లోని కుక్కలను పట్టుకొని నూకపల్లిలోని జంతు సంరక్షణ కేంద్రంలో శస్త్రచికిత్స చేసి మళ్లీ వార్డుల్లో వదిలి పెట్టారు. ఈ చర్యతో వీటి సంతతి తగ్గుతుందని పురపాలిక అధికారులు భావించారు.

**నిధులకు ఎసరు..**



కేవలం కుక్కల కుటుంబ నియంత్రణకు సాధారణ నిధులు రూ.70 లక్షలు వ్యయం చేయడంపై పలువురు పాలకవర్గ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. పట్టణంలో పలు దీర్ఘకాలిక సమస్యలెన్నో ఉన్నప్పటికీ కేవలం కుక్కల కు.ని. కోసం భారీ మొత్తాన్ని ఖర్చు చేయడం వెనుక కొందరు అధికారులు, ఇతర ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందనే ప్రచారం జరుగుతోంది. స్పష్టత లేని లెక్కలు వేసి నిధులను పక్కదారి పట్టించేందుకు అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**బిల్లు మంజూరు సమయంలో పరిశీలిస్తాం**

కుక్కల నియంత్రణకు రూ.70 లక్షల బిల్లు ఆమోదం పొందినా ఇప్పటి వరకు చెల్లింపులు జరగలేదు. పట్టణంలో మొత్తం 1,000 కుక్కలను మాత్రమే పట్టుకున్నారు. ఇంకా పట్టాల్సినవి ఉన్నాయి. బిల్లు చెల్లింపు సమయంలో లెక్కలు పరిశీలించిన తరువాతే మంజూరు చేస్తాం.చిరంజీవి, కమిషనర్

**5 వేల శస్త్రచికిత్సలు చేశారట!**

పురపాలక అధికారులు స్వల్ప సమయంలోనే 5 వేల కుక్కలకు శస్త్రచికిత్సలు చేశామని.. ఒక్కో కుక్కకు రూ.1,400 చొప్పున మొత్తం రూ.70 లక్షల నిధుల మంజూరుకు గత సెప్టెంబరులో సభ్యుల ఆమోదం పొందారు. దీనిపై సమావేశంలో సభ్యులు అడిగినా ఏ అధికారి కూడా స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. వాస్తవంగా 5 వేల కుక్కలకు కు.ని. చేపడితే తాజాగా పలు కాలనీల్లో కుక్కల సంతానం ఎందుకు కనబడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు మగ కుక్కలకు మాత్రమే కు.ని.చేపట్టే అవకాశం ఉందని ఈ లెక్కన వాటి సంఖ్య 5 వేలు ఉంటే ఆడకుక్కల సంఖ్య మాటేమిటనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. మరోవైపు 48 వార్డుల్లో కలిపి 2 వేల కుక్కలు కూడా ఉండే అవకాశం లేదని పలువురు వార్డు కౌన్సిలర్లు చెబుతున్నారు.

## కార్మికుల కోటా.. ఖాళీలే ఏటా!

ఇంజినీరింగ్ విద్యపై యువతలో క్రేజ్ తగ్గకున్నా కొన్ని బ్రాంచులకే ఆదరణ కనిపిస్తోంది.. కంప్యూటరు సైన్స్‌తో పాటు ఏఐ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి చూపుతుండగా, సివిల్, మెకానికల్ వంటి కోర్సుల్లో చేరేవారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది.. సింగరేణిలో ఉద్యోగాలకు కీలకమైన మైనింగ్ కోర్సుదీ అదే పరిస్థితి.. మంథని జేఎన్టీయూ కళాశాలలో సంస్థ ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేకంగా కేటాయిస్తున్న సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు.

సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో సూపర్ న్యూమరరీ సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు. ఈఏపీసెట్‌లో ఉత్తీర్ణత ఆధారంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లలకు కళాశాలలో 10 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. ఆరు బ్రాంచుల్లో ఉద్యోగుల పిల్లలకు 18, కార్మికుల పిల్లలకు 18 చొప్పున సీట్లు కేటాయిస్తుండగా ప్రవేశాలు పొందే విద్యార్థుల సంఖ్య ఏటికేడు తగ్గుతోంది.

**అందుబాటులో ఆరు బ్రాంచులు**

కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మైనింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ బ్రాంచులు అందుబాటులో ఉన్నాయి. సింగరేణి అధికారులు, కార్మికుల పిల్లలకు కలిపి 36 సీట్లు కేటాయిస్తున్నారు.

**రెండేళ్లలో ఒక్కరూ చేరలే!**

జేఎన్టీయూ 2010లో సెంటినరీకాలనీలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసింది. భవన నిర్మాణానికి సింగరేణి సంస్థ కొన్ని నిధులు కేటాయించింది. సివిల్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్, మైనింగ్, మెకానికల్ కోర్సులు అందుబాటులో ఉండగా ప్రారంభంలో సూపర్ న్యూమరరీ కోటా కింద అయిదు శాతం సీట్లు సింగరేణికి కేటాయించారు. 2022-23 నుంచి 10 శాతానికి పెంచారు. ఆరు బ్రాంచులో 36 సీట్లు కేటాయించగా 2022-23లో 26, 2023-24లో 24, 2024-25లో 24 సీట్లు మిగిలిపోయాయి. సివిల్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, మైనింగ్ కోర్సుల్లో గత రెండేళ్లలో ఒక్కరూ చేరలేదు.

మిగులు సీట్ల మాటేమిటి?సింగరేణి కార్మికులు, అధికారుల పిల్లల కోసం కేటాయిస్తున్న సీట్లు ఏటా మిగిలిపోతున్నా, నిబంధనల ప్రకారం ఇతరులతో భర్తీ చేయడానికి వీల్లేదు. ప్రభావిత గ్రామాలు, కాంట్రాక్టు కార్మికుల పిల్లలతో నింపాలన్న వాదన వినిపిస్తోంది. గత మూడేళ్లలో 108 సీట్లకు 74 సీట్లు మిగిలినా ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయడం లేదు. అర్హత ఉన్న విద్యార్థులకు మిగులు సీట్లు కేటాయించడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు పడే అవకాశం ఉంది. సింగరేణి కార్పొరేట్ విభాగం అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎందుకిలా..సింగరేణి సంస్థలో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, మైనింగ్ కోర్సులు ప్రధానమైనవి. సూపర్ న్యూమరరీ కోటా కింద గత మూడేళ్లలో ఈ కోర్సుల్లో ఉద్యోగుల పిల్లలు నలుగురు మాత్రమే ప్రవేశం తీసుకున్నారు.

సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండటంతో ఎక్కువ మంది విద్యార్థులు సీఎస్ఐ, ఏఐ బ్రాంచులపై ఆసక్తి చూపుతున్నారు. గనుల్లో విధులు కష్టంతో కూడుకుని, ఎండలో పని చేయాల్సి ఉండటంతో ఈ కోర్సుల వైపు ఆసక్తి చూపడం లేదు. సంస్థ కార్మికులు, ఉద్యోగులకు పనితీరు తెలుసు గనక, తాము అనుభవించిన కష్టం పిల్లలు పడొద్దని ఇతర కోర్సుల్లో చేరుస్తున్నట్లు ఓ విద్యార్థి తండ్రి తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఏఐ కోర్సులకు డిమాండ్ ఉండటంతో వాటిలో చేరాలని పిల్లలపై కుటుంబ సభ్యులు ఒత్తిడి తెస్తున్నారు. సంస్థకు ప్రధానమైన ఈ కోర్సుల్లో విద్యార్థులు చేరకపోవడం ఆందోళన కలిగిస్తోందని సింగరేణి సంస్థకు చెందిన ఓ అధికారి పేర్కొన్నారు.

# బౌద్ధక్షేత్రం.. అభివృద్ధి గగనం

పెద్దపల్లి : కరీంనగర్ నుంచి 30 కి.మీ..పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామంలో ప్రఖ్యాత బౌద్ధస్తూపం ఉంది. శాతవాహనులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారనేందుకు ఇక్కడున్న శిథిలమైన కోటలు తార్కాణంగా నిలుస్తున్నాయి. ధూళికట్ట, వడ్కాపూర్ గ్రామాల సరిహద్దులో హుస్సేన్‌మియా వాగు తీరంలో కొలువైన ఈ ప్రాంతానికి మహర్దశ లభించేలా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోనుంది. రాష్ట్రంలోని ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా గుర్తించాలని ఇటీవల జరిగిన ముఖ్య అధికారుల సమీక్షలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటే ఈ క్షేత్రం పర్యాటకధామంగా మారడమే కాకుండా రెండు మండలాలు మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక ప్రజలు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'స్వదేశీ దర్శన్' పథకం కింద చేపట్టబోయే పలు బౌద్ధ పర్యాటక క్షేత్రాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అభివృద్ధి చేసే జాబితాలో జిల్లాలోని ఈ క్షేత్రాన్ని చేర్చి త్వరితగతిన నిధులు కేటాయించి అభివృద్ధి చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో 'ఈనాడు' ప్రస్తావించగా పర్యాటకాభివృద్ధి ప్యాకేజీ కోసం ఇటీవల రామగిరిఖిల్లా, సబ్బితం జలపాతాలకు నిధులు కేటాయించాలని నివేదించామన్నారు. బౌద్ధస్తూపం అభివృద్ధికి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదన్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం ఆదేశిస్తే పర్యాటకాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

స్తూపం వద్దకు వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదు. కనీసం విద్యుత్తు దీపాలు లేవు. స్తూపంపై గడ్డి మొలిచి పూర్తిగా కప్పేయడంతో చారిత్రక ఆనవాళ్లకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. ఏటా జరిగే ఉత్సవాలకు వచ్చే విదేశీ పర్యాటకులు ఇక్కడి అసౌకర్యాలపై ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, మ్యూజియం, పార్కులు, వసతి సదుపాయాలు కల్పించాలి.

పూదరి చంద్రయ్య గౌడ్

అతిపెద్ద స్తూపం

ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్దదైన ఈ బౌద్ధస్తూపాన్ని సందర్శించడానికి మే నెలలో నిర్వహించే బుద్ధజయంతి సందర్భంగా థాయ్‌లాండ్, అమెరికా, చైనా, నేపాల్ లాంటి దేశాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, పశ్చిమబెంగాల్, హైదరాబాద్ నుంచి సందర్శకులు, బౌద్ధ భిక్షువులు, పెద్దఎత్తున తరలి వస్తుంటారు.

శాతవాహనుల వీరత్వంతో పాటు మహనీయుడైన గౌతమబుద్ధుడి జీవిత విశేషాలను తెలుసుకునేందుకు ఈ ప్రాచీన కట్టడం ఇప్పటికీ సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. కాగా ఇక్కడికి వెళ్లేందుకు సరైన రవాణా వసతి లేదు. ధూళికట్ట, వడ్కాపూర్ గ్రామాల నుంచి 3 కిలోమీటర్ల మేర వర్షాకాలంలో కాలినడకన, ఎడ్లబండ్లపై, ఇతర రోజుల్లో ద్విచక్రవాహనంపైనే వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి.

ప్రభుత్వం నూతన పర్యాటక పాలసీలో భాగంగా దేశ, విదేశాల్లోని బౌద్ధులను ఆకర్షించేలా జిల్లాలోని ఈ క్షేత్రం వద్ద డిజిటల్ మ్యూజియం, ప్రదర్శన శాల, శాసనాల సమాచారం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

2002 సంవత్సరం నుంచి బుద్ధజయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. క్రీ.శ 2వ శతాబ్దంలో శాతవాహనుల కాలంలో నిర్మించారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. పురావస్తుశాఖ 1972లో తవ్వకాలు చేపట్టి స్తూప విశేషాలను వెల్లడించాలనే ఉద్దేశంతో పునరుద్ధరణ పనులు చేపట్టినప్పటికీ అనంతరం పట్టించుకోలేదు.

ఇక్కడ ఎలాంటి భద్రత, పర్యవేక్షణ లేదు. గుప్తనిధులు ఉన్నాయనే కారణంతో పలువురు కట్టడాలను ధ్వంసం చేస్తున్నారు. రాత్రివేళల్లో తవ్వకాలు జరుపుతూ చారిత్రక ఆధారాలను ధ్వంసం చేస్తున్నారు. అయిదేళ్ల క్రితం పురావస్తుశాఖ జరిపిన తవ్వకాల్లో బౌద్ధశిల్పాలు, శాతవాహనులు కొలిచిన శిల్పాలను వెలికితీసి కరీంనగర్ జిల్లాలోని పురావస్తు శాఖ మ్యూజియంలో భద్రపరిచారు.

# స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనా..!

నాంపల్లి : గడువు తీరిన గ్రామ పంచాయతీ పాలకవర్గాల ఎన్నికలకు మరికొంత కాలం వేచిచూడక తప్పేలా లేదు. 'రాబోయే మూడు, నాలుగు నెలల్లో బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ సభలో పేర్కొన్నారు.' దీంతో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందా అని ఆతృతగా ఎదురు చూస్తున్న ఆశావహుల ప్రయత్నాలపై నీళ్లు చల్లినట్లయింది. గత ఎనిమిది నెలలుగా ప్రజలతో మమేకమై స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న వీరి కథ మళ్లీ మొదటికొచ్చినట్లయింది.

రిజర్వేషన్లపై ఆసక్తి..

కులగణన ద్వారా రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలు, గ్రామాలస్థాయి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాపై లెక్కలు తీసి రిజర్వేషన్ల నిర్ధారణ అనేది సుదీర్ఘ కసరత్తుతోపాటు చాలా రోజులు పట్టనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ 2025లోనే జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీసీ కులగణనపై సీఎం ప్రకటన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ నేపథ్యంలో గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'పంచాయతీ రాజ్ చట్టం-2018' అమలుపై సందిగ్ధం నెలకొంది. ఒక వేళ చట్టంలో మార్పులు చేస్తే జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించే అవకాశముందనే చర్చ రాజకీయ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది. ఇదే జరిగితే పాత రిజర్వేషన్ల ప్రాతిపదికన గత ఎనిమిది నెలలుగా ఎదురుచూస్తున్న ఆశావహుల ఆలోచనలు తారుమారయ్యే అవకాశం ఉండటంతో స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ఆసక్తి నెలకొంది.

ఓటరు జాబితా ప్రచురణతో..గత ఫిబ్రవరి 1న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆ సమయంలో ఈసీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎన్నికల సామగ్రి సిద్ధం చేశారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికలు జూన్‌లో నిర్వహిస్తారని అంతా భావించారు. కానీ బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణన డిమాండ్ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు మరింత ఆలస్యమయ్యాయి. ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం ఓ అడుగు ముందుకేసి సెప్టెంబరు 28 వరకు తుది ఓటరు జాబితా ప్రచురణ, ఇతరత్రా పనులు ముగించాలని జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించింది. దీంతో త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతోందనే సంకేతాలు రావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఇటీవలి సీఎం ప్రకటనతో వచ్చే కొత్త సంవత్సరంలోనే స్థానిక పోరు ఉంటుందనే చర్చ జోరందుకుంది.

# పల్లె వెలుగులోనూ ఆన్‌లైన్ సేవలు




గోదావరిఖని : సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్న టీజీఎస్ ఆర్టీసీ.. ప్రయాణికులు మరింత సులభంగా ఛార్జీలు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే సూపర్‌లగ్జరీ ఆపై స్థాయి సర్వీసులకు క్యూఆర్ స్కానర్ ద్వారా ఛార్జీలు స్వీకరిస్తున్న ఆర్టీసీ.. పల్లెవెలుగుతోపాటు ఎక్స్‌ప్రెస్‌లలో సైతం అమలు చేసేందుకు చర్యలు ముమ్మరం చేసింది. 'ప్రగతి రథం.. ప్రజాసేవా పథం' అనే నినాదంతో ముందుకు సాగుతున్న సంస్థ.. ప్రస్తుతం సీట్ల రిజర్వేషన్, డిజిటల్ లావాదేవీలను అమలు చేస్తోంది.

సమస్యలనూ ఫిర్యాదు చేయవచ్చు..

మరోవైపు ప్రస్తుత కాలంలో దాదాపు చాలామంది ప్రయాణికులు స్మార్ట్‌ఫోన్ వాడుతున్నారు. దీంతో ప్రయాణానికి సంబంధించిన సమస్యలను సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదు చేసేందుకు, అలాగే ప్రయాణించే బస్సు ఎక్కడుందో తెలుసుకునేందుకు మరో క్యూ ఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టనుంది.

అన్ని రకాల సేవలు..

ఆర్టీసీ ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్‌తో అన్ని రకాల సేవలను పొందవచ్చు. ఒక్కసారి స్కాన్ చేస్తే ఆర్టీసీకి సంబంధించిన పది రకాల యాప్‌లు వినియోగించుకునే అవకాశముంది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్(వెబ్‌సైట్), గమ్యం(ఆండ్రాయిడ్ ఐఓఎస్), ఆన్‌లైన్ బుకింగ్ తదితర సేవలను పొందవచ్చు. ఇందులో ఏది అవసరమైతే దాన్ని ఎంచుకుకోవడంతోపాటు మన వివరాలు పొందుపరిస్తే ఎక్కడైనా వినియోగించుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 811 సర్వీసులు

ఉమ్మడి జిల్లాలో 11 డిపోలకు సంబంధించి 811 సర్వీసులు నడుస్తున్నాయి. 479 ఆర్టీసీ, 332 అద్దె బస్సులు నడుపుతున్నారు. ఆర్టీసీ నడిపే అన్ని సర్వీసులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో ఏ బస్సు ఎక్కడుంది? బోర్డింగ్ పాయింట్ నుంచి ప్రయాణించే బస్సు ఏ రూట్‌లో వెళ్తుంది? ఎంత సమయానికి గమ్యం చేరుకుంటుందన్న వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశముంది. దీనికి తోడు మరింత సాంకేతికను జోడించి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో సేవలందించేందుకు క్యూఆర్ విధానాన్ని తీసుకువస్తున్నారు.

ఆన్‌లైన్ సేవలు వినియోగించుకోవాలి

సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలి. సులభతరంగా ఛార్జీలు చెల్లించేందుకు త్వరలోనే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో క్యూఆర్ కోడ్‌ను అమలు చేయనున్నాం. నాగభూషణం, గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్

# అమలులోకి ధరల పెంపు



జగిత్యాల : ఉమ్మడి జిల్లా రైతులు పండించే వివిధ పంట ఉత్పత్తులకు ప్రభుత్వం పెంచిన కనీస మద్దతు ధరలు (ఎంఎస్పీ) సెప్టెంబరు నుంచి అమల్లోకి రానుండగా ఈ ధరలు ఏడాది పాటు వర్తిస్తాయి. నీటి లభ్యతతో ఈ వానాకాలంలోనూ 9.50 లక్షల ఎకరాల్లో వరి ప్రధాన పంటగా ఉండగా ప్రభుత్వం సన్నాలకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను ఇస్తామనటంతో ఈ సీజన్‌లో సన్నగింజ రకాలను 42 శాతం విస్తీర్ణంలో సాగుచేశారు. గతంలో మాదిరిగా లావుగింజ రకాలతో పాటుగా సన్నగింజ రకాలను రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేస్తేనే రైతులకు కనీస మద్దతు ధరలు దక్కుతాయి.

ప్రభుత్వ సంస్థల సేకరణకు మద్దతు ధర

దొడ్డుగింజ ధాన్యం, మక్కలు, కందులు, సెనగలు, సోయాబీన్, మినుములు తదితర ఉత్పత్తులను ప్రభుత్వం గత సీజన్లలో కొనుగోలు చేయగా ప్రభుత్వ రంగ సంస్థల సేకరణతో కనీస మద్దతు ధర చెల్లిస్తారు. సన్నగింజ వరిరకాల సేకరణ, బోనస్ చెల్లింపుపై మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది.

ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి

ఇలా చేస్తేనే మేలు

పత్తిని 1.80 లక్షల ఎకరాల్లో సాగుచేస్తుండగా సీసీఐ ద్వారా కేవలం 2-15 శాతం పంటనే కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన దూదిని రైతులు మార్కెట్లు, గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు.

మార్కెట్లో పత్తికి ధర తగ్గితే సీసీఐ సేకరణ కేంద్రాల సంఖ్యను పెంచాల్సి ఉంది. కేంద్రం కోటా ఇవ్వలేదనే కారణంతో కందులను అత్యంత పరిమితంగానే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుండటంతో రైతులందరికీ మద్దతు ధర దక్కటం లేదు.

మక్కలకు బయటి మార్కెట్లో ధర తగ్గితే మార్క్‌ఫెడ్ ద్వారా కొనాల్సి ఉంటుంది.

వేరుసెనగ, సెనగలు, మినుములు, పెసలు, సోయాబీన్ తదితర ఉత్పత్తుల సేకరణనూ చేపట్టాల్సి ఉంటుంది.

పసుపు పంటకు ఈ సీజన్‌లోనూ మద్దతు ధరను ప్రకటించనందున విపణి ధరపైనే రైతులు ఆధారపడాల్సి ఉంటుంది.

పదేళ్ల తరువాత ఇటీవల పసుపు పంటకు మంచి ధర లభించగా ముమ్ముందు ధర తగ్గితే పసుపును కూడా గతంలో మాదిరిగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలని, గిట్టుబాటుకాని పంటలకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్‌లో మద్దతు కన్నా ధర తగ్గినపుడు ప్రభుత్వం మార్కెట్ జోక్య పథకం ద్వారా సదరు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తే రైతులకు మద్దతు ధరలతో కనీస మొత్తం చేతికంది, ఆర్థిక ఆసరా లభిస్తోంది.

# నిధులు రావు వృథా ఆగదు

ఎగువమానేరు : ఈ ఏడాది వర్షాకాలం సీజన్ ప్రారంభమైన మూడు నెలల వరకు సమృద్ధిగా వర్షాలు లేక జలాశయాలకు నీరు చేరలేదు. పంటలకు సాగునీటి విడుదలపై అప్పటి వరకు అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల మొదటి వారం అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని భారీ, మధ్య, చిన్నతరహా జలాశయాలన్నీ నిండుకుండలా మారాయి. పురాతన జలాశయం నర్మాలలోని ఎగువమానేరు కుడికాల్వ షట్టర్ల లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. ఇదొక్క జలాశయంలోనే కాదు. నిమ్మపల్లి, నక్కవాగు, చంద్రవంక జలాశయాల్లోనూ తూములు, కాల్వల షట్టర్ల వద్ద దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో వరిసాగు విస్తీర్ణం 70 శాతం పైన ఉంది. ఇటీవల వర్షాలకు మెట్టప్రాంతమైన జిల్లాలో 2.14 మీటర్ల మేర భూగర్భజలాలు పైకి వచ్చాయి. సగటున 8.15 మీటర్లలో భూగర్భ జలాలున్నాయి. ప్రధానంగా వరి పంటకు నెల రోజులు మాత్రమే నీరు ఎక్కువగా అవసరం ఉంటుంది. జలాశయాలకు ఉన్న నీటి నిల్వలకు లీకేజీలను పూర్తిస్థాయిలో నిలువరించ గలిగితే వచ్చే యాసంగి పంటలకు ఢోకా ఉండదు. లేకుంటే యాసంగి సీజన్‌లో సాగునీటి కష్టాలు తప్పవు.

ఎగువమానేరు జలాశయం షట్టర్ల ద్వారా లీకేజీల రూపంలో సుమారు వంద క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ రెండు టీఎంసీలకు పూర్తిస్థాయిలో ఉంది. దీని పరిధిలో 45 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కాగా ఏడాది పొడవునా పూర్తిస్థాయి నీటి నిల్వ ఉంటే సాగు విస్తీర్ణం రెండింతలు పెరుగుతుంది.

నిజాం కాలంలో నిర్మించిన ఎగువమానేరు జలాశయం పూర్తిస్థాయి ఆధునికీకరణకు మూడేళ్లుగా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తూనే ఉన్నారు. ఆర్థిక సంవత్సరం మారినప్పుడల్లా ప్రతిపాదనలు రివైజ్ చేయడం మినహా నిధులు విడుదల ఊసేలేదు.

ఎగువమానేరు, నిమ్మపల్లి, నక్కవాగు, చంద్రవంక జలాశయం



ఆయకట్టు రైతులంతా కలిసి బాగుచేసుకుందామంటే పురాతనమైన కట్టడాలు కావడంతో షట్టర్ల వద్ద పనులు చేయలేని పరిస్థితి. ఇక జలాశయం కుడి, ఎడమ కాల్వల్లో పూడుకుపోయిన తూములను, పేరుకుపోయిన మట్టిని అక్కడక్కడ రైతులు శ్రమదానంతో తొలగిస్తున్నారు. నీరు వృథాగా పోతున్నా అందుబాటులో ఉన్న వనరులతో అధికారులు మమ అనిపించాల్సిన పరిస్థితి నెలకొంది.

తూము షట్టర్ల మరమ్మతులు, ఆయిలింగ్, గ్రీజింగ్ పనులకు నిధుల కొరత ఏర్పడింది. ఓఅండ్‌ఎం బిల్లులు రావడం లేదని ఇటీవల నీటిపారుదలశాఖ ఇంజినీర్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని కోరారు. దీంతో నీటిపారుదలశాఖలో ఓఅండ్‌ఎం పనులకు బడ్జెట్ పెంచినట్లు సమాచారం.

నిధులు వస్తే పనులు చేయిస్తాం

వర్షాలకు దెబ్బతిన్న నీటివనరులకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపాం. కొన్నింటికి తాత్కాలికంగా మరమ్మతులు చేయించాం. నిధులు వస్తే పూర్తిస్థాయిలో పనులు చేయించి లీకేజీలు కాకుండా చూస్తాం. అమరేందర్‌రెడ్డి, ఈఈ, నీటిపారుదలశాఖ

# రహదారి విస్తరణకు మార్గం సుగమం

ధర్మపురి : నిజామాబాద్ - జగ్దల్‌పూర్ 63వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సర్వే పనులు ఇప్పటికే పూర్తిచేసిన అధికారులు.. భూ సేకరణకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజల నుంచి అభిప్రాయాలు సైతం సేకరించారు. దీంతో తుది నోటిఫికేషన్ జారీకి రంగం సిద్ధం చేశారు. ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా.. మంచిర్యాల సెక్షన్ పరిధిలో 131.8 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అధికారులు నిర్ణయించారు.

మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, లక్షెట్టిపేట, హాజీపూర్ పట్టణాల గుండా గతంలో నిర్వహించిన సర్వేల ప్రకారం రహదారి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా.. జనావాసాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, దుకాణ సముదాయాల కారణంగా అభ్యంతరాలు వెల్లువెత్తడంతో రహదారిని కొద్దిగా మార్పులు చేసి బైపాస్ చేశారు. ఇప్పటికే సర్వే పూర్తి కాగా భూ రికార్డుల్లో లోపాలను సవరించి తుది నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధం చేస్తున్నారు.

పరిగణనలోకి పలు అంశాలు..

రహదారి విస్తరణలో భాగంగా గత నెలలో ధర్మపురి, బుగ్గారం కేంద్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్ మణికుమార్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా పర్యావరణం, సామాజిక, ఆర్థిక అంశాలను పరిగణలోకి తీసుకొని నివేదికలను రూపొందిస్తున్నారు.

కోల్పోనున్న 112 ఎకరాలు..



బుగ్గారం మండలంలో సిరివంచకోట, బుగ్గారం, గోపులాపూర్, మద్దునూర్ గ్రామాల నుంచి.. ధర్మపురి పరిధి రాయపట్నం, స్తంభంపల్లి శివారు వరకు రహదారిని నిర్మించేలా రూపకల్పన చేశారు. దీంతో మొత్తం 112 ఎకరాల భూమిని రైతులు కోల్పోవాల్సి వస్తోందని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే రైతులకు ఇచ్చిన నోటీసుల్లో ఉన్న భూమికి, క్షేత్ర స్థాయిలో తేడా ఉందని రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

అన్నదాతల ఆవేదన..

రహదారి విస్తరణ సందర్భంగా తమ విలువైన భూములు కోల్పోతున్నందుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటి ధర బహిరంగ మార్కెట్‌లో ఎకరం కనీసం రూ.30 నుంచి రూ.40 లక్షల ధర పలుకుతోంది. ప్రభుత్వం పరిహారం పెంచాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు ఇంతకాలం భూమినే నమ్ముకొని జీవించిన తమకు ఉపాధి ఉండదని వాపోతున్నారు.

లోపాలను సవరిస్తాం..రైతుల నుంచి వచ్చిన భూ సాంకేతిక సమస్యలను పరిష్కరించి.. వారం, పది రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశముంది. అన్ని లోపాలను పూర్తిగా సవరిస్తాం. రైతుల నుంచి వచ్చిన ప్రతి విషయాన్ని పరిశీలించిన తర్వాతే నోటిఫికేషన్ జారీ చేస్తాం. తహసీల్దార్ కృష్ణ చైతన్య

# నిధుల కోసం నిరీక్షణ

జగిత్యాల : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ద్వారా జిల్లాలో పెద్దఎత్తున ఆయకట్టు స్థిరీకరణ పనులకు ఇటీవల అధికారులు ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రతిపాదిత పనులకు నిధులు విడుదలచేసేలా ప్రజాప్రతినిధులు కృషిచేస్తే వేసవిలోపు పనులు ముగిసి వచ్చే వానాకాలం నుంచి జిల్లాలోని ఆయకట్టేతర ప్రాంత రైతులకూ లాభం కలిగే అవకాశముంది.

ప్రతిపాదిత పనులుశ్రీరామసాగర్ మిగులు జలాలను దిగువకు తరలించేలా, దిగువనుంచి ఎల్లంపల్లి జలాలను శ్రీరామసాగర్‌లోకి ఎత్తిపోసేలా వినియోగిస్తున్న వరదకాలువకు అనుబంధంగా రూ.763.31 కోట్లతో పలు పనులకు ప్రతిపాదించారు. ఇందులో కథలాపూర్ మండలం దుంపేట వద్ద పంపుహౌస్ నిర్మించి 52.30 కి.మీ వద్ద ఓటీద్వారా నీటిని తీసుకుని కలికోట సూరమ్మ చెరువు, లక్కాకుల, తుమ్మల చెరువులను నింపాలి.

రుద్రంగి చెరువు ప్రధాన కుడికాలువ కొత్తపేట, మోత్కురావుపేట వద్ద పంపుహౌస్‌లు నిర్మించి కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లోని ఎల్లమ్మ తదితర చెరువులను నింపాలి.

వరదకాలువ 47.600 కి.మీ వద్ద ఎడమకాలువ పంపుహౌస్ నిర్మాణంతో 14ఆర్ కాలువ నింపటం ద్వారా కథలాపూర్, మెట్పల్లి మండలాలకు నీరందుతుంది. 76.22 కి.మీ మద్దుట్ల వద్ద పంపుహౌస్ నిర్మాణంతో కొత్తచెరువు నిండుతుంది. గొర్రెగుండం గుడిచెరువు వద్ద పంపుహౌస్‌తో నల్లమట్టు చెరువును నింపవచ్చు. ఈ ప్రధాన పనులతో పాటుగా కొడిమ్యాల మండలంలో పలు నిర్మాణాలు, వరదకాలువలో రంగాపూర్ వద్ద 3.5 కి.మీ లైనింగ్ తదితర పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీరణను రూ.136 కోట్లతో చేపట్టగా మిగులు పనులను పూర్తిచేయాలి. మిషన్ కాకతీయ పథకం ద్వారా అసంపూర్తి చెరువుల పునరుద్ధరణకు రూ.120 కోట్లవరకు నిధులను విడుదల చేయాల్సి ఉంది. దీనిపై నీటిపారుదలశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపాదిత నిర్మాణాలు, అవసరమున్న మరమ్మతుకు దశలవారీగా నిధులు విడుదల అవుతాయన్నారు. జిల్లాలో 35 చెక్‌డ్యాంల నిర్మాణాన్ని తలపెట్టగా 11 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.57.07 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఆయకట్టు పరిధిలో ఆపరేషన్, నిర్వహణ, మరమ్మతు నిమిత్తం 130 పనులకు అనుమతులు రాగా పనుల పూర్తికి ఇంకా రూ.17.41 కోట్లు విడుదల చేయాల్సిఉంది.

వరదకాలువ 67.500 కి.మీ వద్ద కుడికాలువ పంపుహౌస్ నిర్మాణంతో 15ఆర్‌కాలువను నింపటంద్వారా మేడిపల్లి, జగిత్యాల, మల్యాల మండలాలకు నీరందుతుంది. ప్రధానంగా 8 పనులను రూ.805.31 కోట్లతో చేపట్టడం ద్వారా అదనంగా 54,215 ఎకరాల భూమికి సాగునీరందించి ఆయకట్టు పరిధిలోకి వస్తుంది. 59.500 కి.మీ వద్ద కుడికాలువ పంపుహౌస్ ద్వారా మేడిపల్లి, బీమారం, కథలాపూర్, కోరుట్ల మండలాలకు నీరు పారుతుంది.

# టిటిడి పాలకమండలిని ప్రకటించిన కూటమి సర్కార్



## తితిదే ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు

అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పాలక మండలి నూతన ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు నియమితుల య్యారు. 24 మంది సభ్యులతో తితిదే పాలకమండలి ఏర్పాటు కానుంది. ఈ మేరకు తితిదే అధికారిక ప్రకటన విడుదల చేసింది. **తితిదే బోర్డు సభ్యులు వీరే..** జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట ఎమ్మెల్యే) వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (కోవూరు ఎమ్మెల్యే) ఎం.ఎస్ రాజు (మడకశిర ఎమ్మెల్యే)పనబాక లక్ష్మి (కేంద్ర మాజీ మంత్రి) జాస్తి పూర్ణ సాంబశివరావు, నన్నూరి నర్సిరెడ్డి (తెలంగాణ), శ్రీసదాశివరావు నన్నపనేని, కృష్ణమూర్తి ( తమిళనాడు), కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, దర్శన్. ఆర్.ఎన్ (కర్ణాటక), జస్టిస్ హెచ్ఎల్ దత్ (కర్ణాటక) శాంతారామ్, పి.రామ్మూర్తి (తమిళనాడు), జానకీ దేవి తమ్మిశెట్టి, బూంగునూరు మహేందర్ రెడ్డి (తెలంగాణ), అనుగోలు రంగశ్రీ (తెలంగాణ), బూరగాపు ఆనందసాయి (తెలంగాణ), సుచిత్ర ఎల్ల (తెలంగాణ), నరేశ్‌కుమార్ ( కర్ణాటక), డా.అదిత్ దేశాయ్ (గుజరాత్), సౌరభ్ హెచ్ బోరా (మహారాష్ట్ర).

# సీఎం జగనే ఇసుక వ్యాపారం చేశారు: ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు: రూరల్ టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన 'ఉచిత ఇసుకపై జన ఆనందం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఉచిత ఇసుక విధానంపై భవన నిర్మాణ కార్మికులు, బిల్డర్లు, నిర్మాణదారులు, ట్రాక్టర్ల యజమానులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో ట్రక్కు ఇసుక ధర రూ.5 వేలు నుంచి రూ.6 వేలు ఉండేదని.. అయినా ఇసుక దొరికేది కాదన్నారు. ఇప్పుడు అదే ఇసుక రూ.1000 వస్తోందన్నారు. వైసీపీ హయాంలో సీఎం జగనే ఇసుక వ్యాపారం చేశారని, ఎమ్మెల్యేలకు ప్రశ్నించే అవకాశం ఉండేది కాదని, ఏజెంట్లుని పెట్టుకుని ఇసుక వ్యాపారం నడిపించారని ఆరోపించారు. వైసీపీ హయాంలో ఇసుక ట్రాక్టర్లకు లోడ్ చేసేవాళ్ళు కాదని, టిప్పర్లు లోడ్ చేసేవాళ్ళని ఎమ్మెల్యే కోటంరెడ్డి అన్నారు. ఎందుకంటే ట్రాక్టర్లు పేదోళ్ళవి.. టిప్పర్లు ముఖ్యమంత్రివి.. ఇసుక టిప్పర్లు టచ్ చేస్తే సీఎం కార్యాలయం నుంచి కాల్ చేసే వాళ్లని.. ఎస్పీలు, కలెక్టర్లు ఏజంట్లుగా పని చేశారని అన్నారు. 11 సీట్లు ఇచ్చి జనం ఛీ కొట్టి తిరస్కరించారని.. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వానికి వైసీపీ నేతలు సహకరించాలని సూచించారు. ఇసుక




విషయంలో వైసీపీ మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. జగన్ పాలనలో ఇసుక విషయంపై ఎమ్మెల్యే, ఎంపీలకు మాట్లాడే హక్కు కూడా ఉండేది కాదన్నారు. జగన్ రాష్ట్రాన్ని దివాలా తీయిస్తే, చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. ఇసుక కోళ్లగొట్టి జగన్ ప్రజల నెత్తిన భారం పెట్టారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేరుస్తున్నారని.. 'ఇసుక అధిక ధరల అంతం.. చంద్రబాబు పంతం' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యానించారు.


# ఇంగ్లండ్ నుంచి భారీగా బంగారం తరలింపు.. ఎందుకంటే



కేంద్ర బ్యాంక్ ఆర్బీఐ ధన త్రయోదశి రోజున (మంగళవారం) 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్' నుంచి ఏకంగా 102 టన్నుల బంగారాన్ని మన దేశానికి తరలించింది. ఈ బంగారు ఖజానా మొత్తం మనదే. 1990లలో ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు తాకట్టు పెట్టి రుణాలు సేకరించింది. అయితే భద్రతతో పాటు వేర్వేరు కారణాలతో బంగారాన్ని అక్కడే చాలా కాలం నిల్వ చేసింది. అయితే తాజాగా అత్యంత వ్యూహాత్మకంగా ఈ బంగారాన్ని క్రమక్రమంగా భారత్‌కు తరలిస్తోంది. తాజాగా మంగళవారం నాడు అనగా ధన త్రయోదశి రోజున 102 టన్నుల బంగారాన్ని అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో భారత్‌కు తీసుకొచ్చింది. ఇందుకోసం ప్రత్యేక విమానాలను కూడా ఉపయోగించింది. తాజా తరలింపుతో కలుపుకొని మన దేశంలో బంగారం నిల్వలు 510.5 టన్నులకు చేరాయి. ఇంగ్లండ్‌లో దాచింది మొత్తం 855 టన్నులు కాగా మిగతా పసిడి ఆ బ్యాంక్‌లోనే ఉంది. అంతర్జాతీయంగా రాజకీయ పరిస్థితులు మారిపోతుండడం, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బంగారాన్ని మన దేశంలోనే సురక్షితంగా దాచుకోవడం మంచిదని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లు కూడా ఇందుకు కారణంగా ఉంది. అందుకే క్రమంగా బంగారాన్ని తరలిస్తోంది. తరలింపు ప్రక్రియలో భాగంగా సెప్టెంబరు 2022 నుండి ఇప్పటివరకు మొత్తం 214 టన్నుల బంగారాన్ని స్వదేశానికి తీసుకొచ్చింది. దీంతో స్వదేశంలో నిల్వ ఉన్న బంగారం నిల్వలు 510.5 టన్నులకు పెరిగాయి. ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో ఇంకా 324 టన్నుల బంగారు నిల్వలు ఉన్నాయి. మరి ఈ బంగారాన్ని కూడా ఆర్బీఐ ఎప్పుడు తరలిస్తుందో వేచిచూడాలి.

# పోలీసుల పేరుతో కిడ్నాప్.. రూ.4లక్షలు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరింపు

ఎస్.కోట: విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలో కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను బుధవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మీడియా సమావేశంలో వెల్లడించారు. "ఈ నెల 28న ఉదయం 5.30 గంటలకు ఎస్.కోట మండలం కొట్టాం గ్రామానికి చెందిన దంతులూరి వెంకటసూర్యనారాయణరాజు ఇంటికి ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చారు. తాము పోలీసులమని, విచారణ నిమిత్తం తీసుకెళు తున్నట్టు చెప్పారు. ఆ తర్వాత సూర్యనారాయణరాజు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. దీంతో ఆయన కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కిడ్నాప్ ఘటనపై 29న ఉదయం సూర్యనారాయణరాజు అల్లుడు కాకార్లపూడి శివప్రసాద్.. ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ భాస్కరరావు బుధవారం ఉదయం 5గంటలకు ఉసిరి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రెండు కార్లలో వస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. గమనించిన పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా.. కిడ్నాప్ వ్యవహారం బట్టబయలైంది. ఏడుగురు కిడ్నాపర్ల నుంచి సూర్యనారాయణరాజును



పోలీసులు రక్షించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు విశాఖపట్నం మధురవాడ కొమ్మాది ప్రాంతానికి చెందిన కసిరెడ్డి రాజుకు, బాధితుడు సూర్యనారాయణరాజుకు దాదాపు 20 ఏళ్లుగా పరిచయం ఉంది. కొంతకాలంగా కసిరెడ్డి రాజు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. సూర్యనారాయణరాజు ఆస్తిపరుడని తెలిసి.. తన ఇద్దరు కుమారులు ప్రవీణ్, సాయి వారి స్నేహితులు మరో నలుగురితో కలిసి కసిరెడ్డి రాజు కిడ్నాప్‌నకు ప్రణాళిక వేశాడు. ఇందులో భాగంగా ఈనెల 28న అతని ఇంటికి వెళ్లి పోలీసులమని చెప్పి కిడ్నాప్ చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశామని, మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నాం" అని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

# ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష తేదీ ఖరారు



అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షకు షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది జనవరి 5న 13 ఉమ్మడి జిల్లాల్లో ఈ పరీక్ష రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష మంది వరకు ఈ పరీక్ష రాసే అవకాశం ఉంది. డీఎస్సీ, ఎస్ఎస్సీ, ఇంటర్ బోర్డు పరీక్షలను దృష్టిలో ఉంచుకొని గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.



# విజయమ్మ లేఖపై జగన్ మథనం!

**వైకాపా అధ్యక్షుడు జగన్, షర్మిల మధ్య ఆస్తుల వాటాల అంశం ఏపీలో తీవ్ర దుమారం రేపుతున్న వేళ.. మూడు రోజుల పర్యటన కోసం జగన్ ఇడుపులపాయ చేరుకున్నారు. పార్టీలో నేతల మధ్య అంతర్గత విభేదాలను పరిష్కరించడంపై ఆయన దృష్టి సారించిన సమయంలోనే.. విజయమ్మ బహిరంగ లేఖ రాయడం చర్చనీయాంశమైంది. తల్లి విడుదల చేసిన లేఖపై ఇడుపులపాయ గెస్ట్‌హౌస్‌లో జగన్ చాలా సేపు ఏకాంతంగా మథన పడినట్లు సమాచారం.**



# బెయిల్ రద్దవుతుందని.. సంతకం చేసినప్పుడు తెలియదా?

అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ బెయిల్ రద్దుకు కుట్రగా ఆ పార్టీ నేతలు పేర్కొనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్‌తో ఆస్తుల వివాదం నేపథ్యంలో ఆమె మరోసారి స్పందించారు. "ఈడీ అటాచ్ చేసింది షేర్లు కాదు.. రూ.32కోట్ల విలువైన కంపెనీ స్థిరాస్తి. షేర్ల బదలాయింపుపై ఎలాంటి ఆంక్షలు, అభ్యంతరాలు లేవు. స్టేటస్‌కో ఉన్నది షేర్లపై కాదు. గతంలోనూ ఎన్నో కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. వాటికి స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్, బదిలీలు మాత్రం ఆపలేదు. ఈడీ అటాచ్ చేసినందువల్ల షేర్ల బదిలీ చేయకూడదనడం హాస్యాస్పదం. నాకు 100 శాతం వాటాలు బదలాయిస్తామని ఎంవోయూపై జగన్ సంతకం చేశారు. బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా? 2021లో రూ.42 కోట్లకు క్లాసిక్ రియాలిటీ, సండూర్, సరస్వతి షేర్లను విజయమ్మకు ఎలా అమ్మారు?బెయిల్ రద్దవుతుందని షేర్లు విక్రయించినప్పుడు తెలియదా?అలా అమ్మడం స్టేటస్ కోను ఉల్లంఘించినట్లు కాదా?షేర్ల బదిలీకి, బెయిల్ రద్దుకు సంబంధం లేదని మీకు తెలుసు. షేర్లు విక్రయించి ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. జగన్ బెయిల్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదని విజయమ్మకు తెలుసు." అని షర్మిల పేర్కొన్నారు.

# ఢిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు

అమరావతి: ఢిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలుపెట్టింది. 'రీ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏపీ భవన్' పేరుతో 11.53 ఎకరాల్లో నిర్మాణం కోసం డిజైన్లకు టెండర్లను ఆహ్వానించింది. 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్'ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని నోటిఫికేషన్ ఇచ్చింది. సాయంత్రంలోపు గుత్తేదారులు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అందులో పేర్కొంది. నవంబర్ 28 లోపు ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఢిల్లీలోని ఏపీ భవన్‌ను విభజించారు. ఎన్నికలకు ముందు 2 తెలుగు రాష్ట్రాల అధికారులు చర్చించి భవన్ విభజనను ఖరారు చేశారు. 2 రాష్ట్రాల అధికారుల ప్రతిపాదనకు కేంద్ర హోం శాఖ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న భవనాలను తెలుగు రాష్ట్రాలు కలిసి వినియోగించకుంటున్నాయి.

# పోలవరం బాధితులకు న్యాయం చేయాలి: సీపీఐ నేత రామకృష్ణ



అనంతపురం టౌన్ : కరవు జిల్లాకు నీరు అందించే హంద్రీనీవాపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో ప్రాజెక్టుల అంశంపై ఆయన మాట్లాడారు. నవంబర్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులకు ఒక్కొక్కదానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రాష్ట్రానికి ప్రయోజనాలు చేకూర్చే పోలవరం ఎత్తు కుదించడానికి కేంద్రం ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్యాకేజీ డబ్బులు ఎగ్గొట్టడానికి కేంద్రం ఈ చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. అలాగే పోలవరం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో పోలవరం ప్రాజెక్టు అంశంపై విజయవాడలో సమావేశం కానున్నట్లు చెప్పారు.

# జెత్వానీ కేసు.. విచారణ ప్రారంభించిన సీఐడీ




అమరావతి: ముంబయి నటి జెత్వానీ కేసులో సీఐడీ అధికారులు విచారణ ప్రారంభించారు. కేసుకు సంబంధించిన దస్త్రాలను ఇబ్రహీంపట్నం పోలీసుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. జెత్వానీ, ఆమె తల్లిదండ్రుల నుంచి వాంగ్మూలం సేకరించారు. ఈ కేసులో ఇప్పటికే వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మరోవైపు వైకాపాతో అంటకాగి అక్రమ కేసులు బనాయించారనే ఆరోపణలపై ఇప్పటికే ఐపీఎస్ అధికారులు కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ, పీఎస్ఆర్ ఆంజనేయులతో పాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. వారిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

# ఉచిత గ్యాస్ సబ్సిడీ.. పెట్రోలియం సంస్థలకు చెక్కు అందజేసిన సీఎం చంద్రబాబు

అమరావతి: సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకానికి ఖర్చయ్యే నిధులను సీఎం చంద్రబాబు పెట్రోలియం సంస్థలకు అందజేశారు. అమరావతిలోని సచివాలయంలో హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఈ సబ్సిడీ మొత్తాన్ని అందించారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు అయ్యే రూ.2,684 కోట్ల ఖర్చుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో మొదటి ఉచిత సిలిండర్‌కు ఖర్చు అయ్యే రూ.894 కోట్లను పెట్రోలియం సంస్థలకు ప్రభుత్వం అందించింది. దీపం-2 పథకంలో భాగంగా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందించనుంది. మూడు విడతల్లో ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లకు అయ్యే ఖర్చు సొమ్మును



విడుదల చేయనుంది. 29వ తేదీ నుంచి ప్రభుత్వం ఈ పథకం కింద గ్యాస్ బుక్ చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకు కల్పించింది. గ్యాస్ సిలిండర్ అందిన 48 గంటల్లో లబ్ధిదారులు సిలిండర్‌కు వెచ్చించిన సొమ్ము వారి ఖాతాలో జమ కానుంది.

## పవన్ 'బంగారం' బ్యూటీ ఎంత అందంగా ఉందో..!

పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'బంగారం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ మీరా చోప్రా. రెండు దశాబ్దాల క్రితం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ ఇప్పటికీ సినిమాల్లో నటిస్తూ ఉంది. అయితే కెరీర్ ఆరంభంలో మాదిరిగా కాకుండా అడపా దడపా సినిమాలు చేస్తూ వస్తోంది. ఏడాదికి ఒకటి అర చొప్పున సినిమాలు చేస్తున్న ఈమె సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతుంది అంటే ఈమె వయసు ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ వయసులోనూ పాతికేళ్ల పడుచు అమ్మాయిగా అందంగా కనిపిస్తూ ఉంటుంది. ఈతరం హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గకుండా ముద్దుగుమ్మ మీరా చోప్రా అందంగా ఉందంటూ సోషల్ మీడియాలో ఆమె ఫోటోలకు నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. యంగ్ హీరోలు సైతం ఈమెతో నటించాలి అనుకునేంత అందంగా ఉందని, ఎందుకు ఆఫర్లు అంతగా రావడం లేదో అర్థం కావడం లేదు అంటూ నెట్టింట కొందరు ఆవేదన వ్యక్తం చేస్తూ ఉండటం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి మీరా చోప్రా ఫ్యాన్స్ తో పాటు ప్రతి ఒక్కరు సర్‌ప్రైజ్ అయ్యే విధంగా అందంగా కనిపిస్తూ



సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ మీరా చోప్రా సొంతం అని మరోసారి నిరూపితం అయ్యింది. క్లోజప్ షాట్ లో చిరు మందహాసం చిందిస్తూ స్టైలిష్ ఔట్ ఫిట్ లో క్లీ వేజ్ షో చేస్తూ మీరా చోప్రా ఈ ఫోటోలో భలే అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నిజంగానే ఈ ఫోటోలో మీరా చోప్రాను చూస్తే మూడు పదుల వయసుకు ఇంకా చేరుకోలేదేమో అనిపిస్తుంది. ఇంత అందంగా ఉన్నా అదృష్టం కలిసి రాకపోవడం వల్ల ఆఫర్లు రావడం లేదు అనిపిస్తుంది. ఆమె ప్రయత్నాలు కొనసాగిస్తే తప్పకుండా సినిమాల్లో కాకున్నా వెబ్ సిరీస్ ల్లో అయినా ఆఫర్లు వస్తాయేమో చూడాలి. ముందు ముందు టాలీవుడ్ లోనూ ఈమె నటించాలని కోరుకునే వారు చాలా మంది ఉన్నారు అనడంలో సందేహం లేదు. బంగారం సినిమాలో పవన్ కళ్యాణ్ కు జోడీగా నటించిన సమయంలో ఎలా అయితే ఉందో ఇప్పుడు అదే అందంతో ఉంది, అంతే కాకుండా సోషల్ మీడియాలో మరింత అందంగా ఈమె కనిపిస్తుందని కొందరు అంటున్నారు. బంగారం సినిమా సూపర్ హిట్ అయి ఉంటే కచ్చితంగా మీరా చోప్రాకి టాలీవుడ్ లో మంచి ఆఫర్లు వచ్చి ఉండేవి. కానీ ఆ సినిమా నిరాశ పరచడంతో కెరీర్ జోరు అందుకోకుండానే వెనక్కి వచ్చి పడాల్సి వచ్చింది. ప్రస్తుతం హిందీ, తమిళ సినిమాలతో పాటు ఇతర భాషల సినిమాల్లోనూ నటిస్తోంది. ఆ మధ్య ఒక ఇంగ్లీష్ సినిమాలోనూ నటించి హాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయింది. ప్రయత్నాలు కొనసాగిస్తున్న మీరా చోప్రా ముందు ముందు అయినా బిజీ అయ్యేనా చూడాలి.

## రాశి ఖన్నా.. ఆ డ్రెస్సుకే అందం వచ్చేలా స్టన్నింగ్ లుక్

ఇప్పటి ఫ్యాషన్ ట్రెండ్‌ను ప్రతిబింబిస్తూ, రాశి ఖన్నా ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని అందమైన ఫోటోలు షేర్ చేసింది. ముంబైలోని ఐటీసీ మరాఠ హోటల్‌లో, రాశి బ్లాక్ కలర్ లెహంగా–చోలి లుక్‌లో హాట్ అండ్ హాఫ్ట్‌గా కనిపిస్తూ తన ఫ్యాషన్ గ్లామర్‌ను చూపించింది. ఈ ఎంబ్రాయిడరీ లెహంగా నిండుగా డిజైన్ చేసిన విధానం హైలెట్ గా నిలిచింది. ఇక అందమైన నగలు జత చేసి, సంప్రదాయ పద్ధతిలో మరింతగా తన అందాన్ని హైలెట్ చేసింది. రాశి తన పోస్ట్‌లో "స్వీట్స్ కాదండి, లుక్స్ సర్వ్ చేస్తున్నాం," అంటూ తన ఫ్యాషన్ స్టేట్మెంట్‌ను పంచుకుంది. ఈ డ్రెస్‌లోని నల్ల రంగు లెహంగాను ఎంపిక చేయడం వల్ల రాశి గ్లామర్ ఇంకా పెరిగింది. ఆమె హాల్టర్–నెక్ టాప్‌కు తగినట్లు మ్యాచింగ్ దూపట్టాను కూడా జోడించడం విశేషం. రాశి ఖన్నా సినిమా కెరీర్ విషయానికి వస్తే



తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఆమె తన సినీ ప్రస్థానంలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలను పోషించింది. తెలుగు, తమిళ పరిశ్రమలో స్టార్‌గా ఎదిగిన రాశి, 2014లో 'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆ తర్వాత ఆమె 'బెంగాల్ టైగర్', 'జై లవ కుశ', 'తొలి ప్రేమ' వంటి చిత్రాలలో తన నటనతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. అలాగే తమిళ పరిశ్రమలో కూడా రాశి తనదైన శైలిలో విజయాలను అందుకుంటోంది. చివరగా ఆమె తెలుగులో నాగచైతన్య థాంక్యూ సినిమాలో నటించింది. ఇందులో రాశి యొక్క నటనకు విశేషమైన ప్రశంసలు లభించాయి. కానీ సినిమా మాత్రం అంతగా సక్సెస్ కాలేదు. రాశి ఖన్నా తెలుగులో మాత్రమే కాకుండా ఇతర భాషల్లో కూడా తన ప్రతిభను ప్రదర్శిస్తూనే ఉంది. అరణ్మనై 4 సినిమాలో కూడా మంచి పాత్రలో కనిపించింది. ఆ సినిమా కమర్షియల్ గా బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ అందుకుంది.




## ఒకే ఫ్రేమ్ లో మెగా-అక్కినేని.. వ్వాటే స్టిల్



ఒకే ఫ్రేమ్ లో నచ్చిన హీరోలంతా కనిపిస్తే.. అభిమానులు ఎంత హ్యాపీగా ఫీలవుతారో స్పెషల్ గా చెప్పనక్కర్లేదు. వారి ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. అంత ఖుషీ అయిపోతారు. అదే రెండు సినీ కుటుంబాలకు చెందిన వారసులు.. ఒకే చోట కలిసి సందడి చేస్తే.. ఫోటో దిగితే.. ఆ ఫీలింగే వేరు. దివంగత అక్కినేని నాగేశ్వరరావు జాతీయ అవార్డు వేడుక.. ఆ అరుదైన.. అద్భుతమైన సందర్భానికి వేదికగా నిలిచింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవికి నిన్న అక్కినేని కుటుంబం.. ఏఎన్నార్ జాతీయ అవార్డును అందించిన విషయం తెలిసిందే. 2024కి గాను ఆ పురస్కారం చిరంజీవికి దక్కింది. బాలీవుడ్ ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ ఆ అవార్డును చిరుకు ప్రదానం చేశారు. ఆ కార్యక్రమానికి అక్కినేని ఫ్యామిలీ మెంబర్స్ అంతా హాజరై సందడి చేశారు. ఆ సమయంలో అక్కినేని కొత్త కోడలు శోభితను చిరుకు పరిచయం చేశారు నాగార్జున. అదే సమయంలో వేడుకకు మెగా కుటుంబం నుంచి చిరంజీవితో పాటు ఆయన తల్లి అంజనా దేవి, కుమారుడు రామ్ చరణ్, కుమార్తె సుస్మిత సహా పలువురు హాజరయ్యారు. అలా మెగా, అక్కినేని కుటుంబాలకు చెందిన అనేక మంది సభ్యులు కార్యక్రమానికి వచ్చారు. అందుకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు ఇప్పటికీ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అభిమానులను ఓ రేంజ్ లో ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు బ్యూటిఫుల్ పిక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మెగా, అక్కినేని హీరోలు కలిసి దిగిన గ్రూప్ పిక్ తో పాటు చిరు, నాగ్ ఫోటో స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తున్నాయి. చిరంజీవి, నాగార్జున, రామ్ చరణ్, నాగచైతన్య, అఖిల్ కలిసి తీసుకున్న ఫోటో అయితే వేరే లెవెల్ లో ఉంది. అంతా బ్లాక్ కలర్ సూట్స్ లో అదరగొట్టారు. మెగాస్టార్, కింగ్ పిక్ అయితే సూపర్ అనే చెప్పాలి. ఆరు పదుల వయసులో ఉన్నా.. ఇంకా యంగ్ గానే కనిపిస్తున్నారు. ఇప్పుడు రెండు పిక్స్.. సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతున్నాయి. బ్యూటిఫుల్ మూమెంట్స్ అంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. ఏఎన్నార్ అవార్డు వేడుక.. ఎన్నో అద్భుతమైన క్షణాలకు వేదికగా నిలిచిందని కొనియాడుతున్నారు. లైకులు కొడుతూ సందడి చేస్తున్నారు. ఆ పిక్స్ ను షేర్ చేస్తున్నారు. ఎప్పటికీ మర్చిపోలేని కార్యక్రమమని చెబుతున్నారు. మరి మీరు ఆ రెండు అడోరబుల్ పిక్చర్స్ ను చూశారా?

## మంచు లక్ష్మి.. ఈ లుక్కు మాత్రం వేరే లెవల్




మంచు లక్ష్మి.. సోషల్ మీడియాలో కొద్దిరోజులుగా ఎలా సందడి చేస్తున్నారో అందరికీ తెలిసిందే. యూట్యూబ్ ఛానల్ లో సంప్రదాయబద్ధమైన వీడియోలు పోస్ట్ చేస్తున్న మంచు డాటర్.. ఇన్‌స్టాగ్రామ్ లో మాత్రం సెగలు పుట్టించే ఫోటోస్ ను షేర్ చేస్తున్నారు. వేరే లెవెల్ లో హీట్ పుట్టిస్తున్నారు. అందాల ఆరబోతకు వయసుతో సంబంధం లేదన్నట్లు తన గ్లామరస్ పిక్స్ తో అలరిస్తున్నారు. ఓ రేంజ్ లో ఫాలోవర్స్ పెంచుకుంటున్నారు. నాలుగు పదుల వయసులో క్రేజీ అండ్ వెరైటీ డ్రెస్సుల్లో మైమరపిస్తున్నారు. కిల్లింగ్స్ లుక్స్ తో మైండ్ బ్లాక్ చేస్తున్నారు. స్టన్నింగ్ పోజులతో ఫిదా చేస్తున్నారు. కుర్రాళ్ల కళ్లను తన వైపు తిప్పుకునేలా చేస్తున్నారు. రెగ్యులర్ గా కొత్త కొత్త పిక్స్ ను పోస్ట్ చేస్తున్నారు. రీసెంట్ గా కాలేజీ అమ్మాయిలు, మోడల్స్ వేసుకునే ఔట్ ఫిట్స్ లో ఒంపుసొంపులతో ఆకట్టుకుంటున్నారు. అలా ఎప్పటికప్పుడు ఆమె ట్రెండింగ్ లోనే ఉంటున్నారు. తాజాగా ఓ ఇంగ్లీష్ మ్యాగజైన్ కవర్ పేజీపై దర్శనమిచ్చారు మంచు లక్ష్మి. గ్రాండియర్ లైఫ్ స్టైల్ అక్టోబర్ ఎడిషన్ కవర్ పేజీపై కనిపించారు. అందులో గ్రీన్ కలర్ కోట్ వేసుకుని వేరే లెవెల్ లో ఉన్నారు. తన లుక్స్ తో హీట్ పుట్టిస్తున్నారు. తన అందాలతో సింపుల్ గా ఫ్లాట్ చేస్తున్నారు. ఓర చూపుతో మాయ చేస్తున్నారు. అందుకు సంబంధించిన ఫోటోను మ్యాగజైన్ నిర్వాహకులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. తెగ వైరల్ అవుతోంది. గ్రాండియర్ లైఫ్ స్టైల్ మ్యాగజైన్ నిర్వాహకులు పెట్టిన పోస్ట్ కు నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు. పిక్ అదిరిపోయిందని కామెంట్లు పెడుతున్నారు. మేడమ్ సార్ మేడమ్ అంతే అని కామెంట్స్ పెడుతున్నారు. మంచు లక్ష్మి కవర్ పేజీ ఫోటోకు ఫిదా అయ్యామని చెబుతున్నారు. కొందరు తమ ఇన్ స్టా స్టోరీస్ లో మ్యాగజైన్ నిర్వాహకులు పోస్ట్ చేసిన పిక్ ను షేర్ చేస్తున్నారు. ప్రస్తుతం మంచు లక్ష్మి ఫోటో నెట్టింట బాగా ట్రెండ్ అవుతోంది. అదే సమయంలో రీసెంట్ గా హైదరాబాద్ నుంచి ముంబై షిఫ్ట్ అయిన మంచు లక్ష్మి.. బాలీవుడ్ లో వరుస ప్రాజెక్టుల్లో అవకాశాలు అందుకోవాలని చూస్తున్నారు. తెలుగులో నటించిన ఆదిపర్వం మూవీతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 1974 – 1990 మధ్య కాలంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఆ మూవీ.. నవంబర్ 8వ తేదీన థియేటర్లలో రిలీజ్ కానుంది. మరి ఆ సినిమాతో మంచు లక్ష్మి ఎలా ఆకట్టుకుంటారో వేచి చూడాలి.

## వైల్డ్ లైఫ్ సఫారీలో సమ్యుక్త.. సింప్లిసిటీలో అందాల రాణి!

సౌత్ సినిమా పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న అందాల తార సమ్యుక్త మీనన్, ప్రస్తుతం వైల్డ్ లైఫ్ సఫారీలో విహరిస్తూ తీసుకున్న కొన్ని ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "Into the Wild" అంటూ యాలా నేషనల్ పార్క్ నుండి ఈ ఫోటోలను పోస్ట్ చేయడం ద్వారా, ఆమె ప్రకృతి ప్రేమను వ్యక్తపరిచింది. పచ్చని చెట్లు, నీటితో నిండిన సరస్సు, మరియు వైల్డ్ లైఫ్ సౌందర్యాలను ఆస్వాదిస్తూ ఆమె తన ప్రయాణాన్ని ఫ్యాన్స్‌తో పంచుకున్నారు. ఈ ఫోటోల్లో ఆమె నేచురల్ లుక్‌తో, సింపుల్ మేకప్‌లో ఎంతో అందంగా కనిపిస్తోంది. సమ్యుక్త మీనన్ కెరీర్ గురించి మాట్లాడుకుంటే, ఆమె అతి తక్కువ కాలంలోనే సౌత్ ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆమె నటనలో వైవిధ్యాన్ని



చూపుతూ, ప్రతి పాత్రలో ప్రత్యేకతను చూపిస్తూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించేందుకు సిద్ధమైంది. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సమ్యుక్త ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ ప్రాజెక్ట్ 2024 వేసవిలో విడుదల కానుంది. ఇక గ్లామర్ పాత్రల్లో మాత్రమే కాకుండా, నటనకు ఆస్కారం ఉన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నంలో ఉంది.

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న చిత్రంలో కూడా ఆమెకు మంచి పాత్ర లభించింది. అదేవిధంగా, లారెన్స్‌తో చేస్తున్న మరొక చిత్రంలో కూడా సమ్యుక్త అద్భుతమైన పాత్రలో కనిపించనుంది. ఈ రెండు సినిమాల్లోనూ సమ్యుక్త గ్లామర్ మరియు నటనా ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకోవడం ఖాయం అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. తన వైల్డ్ లైఫ్ సఫారీ అనుభవాలను పంచుకుంటూ ఇన్‌స్టాలో చేసిన ఈ పోస్ట్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఫోటోలు చూసిన అభిమానులు ఆమె సింప్లిసిటీకి, ప్రకృతి ప్రేమకు ఫిదా అవుతున్నారు. ప్రతి ఫోటోలో ఆమె చిరునవ్వుతో ప్రకృతిలో నిండుగా మమేకం అవుతూ కనిపిస్తోంది.

## మినీ డ్రెస్సులో దేవియాని.. వ్వాటే లుక్!

దేవియాని శర్మ ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్లను ఆకట్టుకుంటున్న ఈ బ్యూటీ ఎప్పటికప్పుడు సరికొత్తగా కనిపిస్తోంది. తన కెరీర్‌ను వెబ్ సిరీస్‌ల ద్వారా ప్రారంభించిన దేవియాని, తొలి అడుగులనే ఆసక్తికరమైన పాత్రలతో ప్రేక్షకుల మదిని గెలుచుకుంది. తెలుగు వెబ్ సిరీస్ 'అనగనగా'లో చేసిన పాత్రతో తన ప్రతిభను నిరూపించుకుని, తెలుగులో మంచి గుర్తింపు సంపాదించుకుంది. తర్వాత 'ఇన్ ది నేమ్ ఆఫ్ ది గాడ్' అనే వెబ్ సిరీస్‌తోనూ అలరించింది. వెబ్ సిరీస్‌లతోనే కాకుండా సినిమాల్లోనూ సక్సెస్‌ను సాధించేందుకు దేవియాని శర్మ ప్రయత్నాలు చేస్తోంది. 'సైతాన్' వెబ్ సిరీస్‌లో వైలెంట్ రోల్‌తో పాటు, 'సేవ్ ది టైగర్స్'లో మోడ్రన్ హౌస్ వైఫ్ పాత్రలో తన నటనతో విభిన్న కేరెక్టరైజేషన్‌ను చూపించింది. ఇవి దేవియాని శర్మకు తాను ఎలాంటి పాత్రను అయినా సరే నెరవేర్చగల దిశగా ఉన్నటువంటి



గుర్తింపును తెచ్చాయి. ఈ రెండు సిరీస్‌లు తెలుగు ప్రేక్షకులలో ఆమెకు ప్రత్యేకమైన ఫ్యాన్ ఫాలోయింగ్‌ను అందించాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో తన గ్లామర్ ఫోటోషూట్లతోను అభిమానులను ఆకర్షిస్తోంది. తాజాగా పింక్ కలర్ మినీ డ్రెస్సులో ఉన్న ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన దేవియాని అందంతో పాటు అభినయంతో కూడా టాలీవుడ్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. చక్కటి కళ్లతో, స్టైలిష్ లుక్స్‌తో దేవియాని అభిమానులను మరింతగా ఆకట్టుకుంటోంది. ఈ ఫోటోలలో ఆమె తన అందాన్ని హైలెట్ చేస్తూ, తన బోల్డ్ స్టైల్‌ను ఫ్యాన్స్‌కు చూపించింది. సోషల్ మీడియా ద్వారా తమ ఫాలోవర్స్‌తో నిత్యం కనెక్ట్ అవుతూ, తన తాజా ఫోటోలతో వారిని అలరిస్తుంది. కమర్షియల్ హిరోయిన్‌గా తన స్థానాన్ని స్థిరపరచుకోవాలనే లక్ష్యంతో ఉన్న దేవియాని శర్మ, సిల్వర్ స్క్రీన్‌పై పెద్ద స్థాయిలో విజయాన్ని అందుకోవాలని కోరుకుంటోంది. మరి ఆమెకు ఎలాంటి అవకాశాలు వస్తాయో చూడాలి.




# పోలీసు విచారణకు రాజ్ పాకాల

హైదరాబాద్: జన్వాడ ఫామ్‌హౌస్ కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల మోకిల పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. న్యాయవాదితో పాటు ఆయన విచారణకు వచ్చారు. నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ ఆధ్వర్యంలో విచారణ సాగుతోంది. ఇటీవల రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పార్టీ కేసుకు సంబంధించి విచారించాల్సి ఉందని అందులో పేర్కొన్నారు. జన్వాడలో ఫామ్‌హౌస్‌పై ఇటీవల సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. ఇక్కడి రిజర్వ్ కాలనీలో ఉన్న రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి పార్టీ నిర్వహించారు. భారీ శబ్దాలతో ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. 21 మంది పురుషులు, 14 మంది మహిళలను అదుపులోకి తీసుకున్నారు. 35 మందితో నిర్వాహకులు మద్యం పార్టీ నిర్వహించారు. డ్రగ్స్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు.. రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు నిర్ధరించారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగానే రాజ్ పాకాలకు నోటీసులు ఇచ్చారు.

# పాదయాత్రకు సిద్ధం.. రేవంత్‌రెడ్డి సెక్యూరిటీ లేకుండా రావాలి : హరీశ్‌రావు



హైదరాబాద్: మూసీ సుందరీకరణకు తాము అనుకూలమేనని.. అయితే సుందరీకరణ పేరిట స్థిరాస్తి వ్యాపారానికి వ్యతిరేకమని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మూసీ పేరిట కమీషన్లు, పేదల ఇళ్లను కూల్చడం వంటి వాటిని వ్యతిరేకిస్తున్నామన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసిత కాలనీ రాజమౌళి సినిమాను తలపిస్తోందంటూ ఎద్దేవా చేశారు. మూసీ బాధితులకు మల్లన్న సాగర్‌కు మించిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. “మూసీ బాధితులకు గచ్చిబౌలి భూముల్లో ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. హైదరాబాద్ నుంచి వాడపల్లి వరకు పాదయాత్ర చేద్దాం. సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా పాదయాత్రకు రావాలి. మమ్మల్ని డీల్ చేయడం కాదు.. రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవాలి. పక్కనున్న వాళ్లే ఆయన్ను దించేయకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వం వచ్చి ఏడాదైనా.. 6 మంత్రి పదవులు నింపుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే భారాసకు 100 సీట్లు రావడం ఖాయం” అని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

# కేసీఆర్ అంటేనే తెలంగాణ చరిత్ర.. మీరా ఆయన పేరును తుడిచేది?: కేటీఆర్



హైదరాబాద్: పదవుల కోసం రేవంత్‌రెడ్డి పరితపిస్తున్నప్పుడు కేసీఆర్ ఉన్న పదవే వదిలేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈమేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు. “ఉద్యమకారులపై గన్ను ఎక్కు పెట్టినప్పుడు కేసీఆర్ ప్రాణాన్నే ఫణంగా పెట్టారు. తెలంగాణను చంపేందుకు రేవంత్ బ్యాగులు మోసిన సమయంలో.. ఆయన రాష్ట్ర భవిష్యత్తుకు ఊపిరి పోశారు. కేసీఆర్ అంటేనే తెలంగాణ చరిత్ర.. మీరా ఆయన పేరును తుడిచేది?” అని కేటీఆర్ పేర్కొన్నారు. మూసీపై ముందుకు.. కొనుగోళ్లపై వెనక్కు అని కేటీఆర్ విమర్శించారు. “రామన్నపేటకు రైరై.. కొనుగోలు సెంటర్లకు నైనై. దామగుండం ధనాధన్.. ధాన్యం కొనుగోళ్లు డాండాం. కొనుగోళ్లకు దిక్కులేదు.. కాంగ్రెస్ కోతలకు లెక్కలేదు. దళారులకు దండిగా.. రైతన్నలకు దండగా. ఎద్దేడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం ఎప్పుడూ బాగుపడదు” అని ‘ఎక్స్’లో పోస్టు చేశారు.

**నాగార్జున, కేటీఆర్ పిటిషన్లపై విచారణ వాయిదా** : మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున, మాజీ మంత్రి కేటీఆర్ వేర్వేరుగా దాఖలు చేసిన పరువునష్టం దావా పిటిషన్లపై నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. కొండా సురేఖ తరఫున న్యాయవాది గురుమిత్‌సింగ్ హాజరయ్యారు. రెండు పిటిషన్లపై విచారణను న్యాయస్థానం నవంబర్ 13కు వాయిదా వేసింది.

# భారాస నేతలు విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: తెలంగాణలో కులగణన ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారాస నేతలు ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన కులాలకు చెందిన వారిపై భారాసకు ప్రేమలేదన్నారు. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా బలహీనవర్గాలకు చెందిన వ్యక్తినే కాంగ్రెస్ పార్టీ నియమించిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తూ.. అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించని కార్యక్రమాలనూ చేపడుతున్నామన్న విషయాన్ని ప్రతిపక్ష నేతలు గుర్తించాలని హితవు పలికారు.



# ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్.. డీఏ పెంపు ఉత్తర్వులు జారీ

హైదరాబాద్: దీపావళి పండుగ సందర్భంగా ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 3.64 శాతం కరవు భత్యం (డీఏ) పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఏ పెంపు 2022 జులై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని తెలిపింది. నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపులు చేయనున్నారు. 2022 జులై ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు. 2025 మార్చి 31వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేస్తారు. 90 శాతం 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేపడతారు. విశ్రాంత ఉద్యోగులకు డీఏ బకాయిలు 2025 జనవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.






# రేవంత్ సర్కార్‌కు బిగ్ షాక్.. కులగణనకు బ్రేక్

హైదరాబాద్ : తెలంగాణలో నవంబర్ 6 నుంచి కులగణన జరగనుంది. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్కు బిగ్ షాక్ తగిలింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కుల గణన సర్వే బాధ్యతను బీసీ కమిషన్కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని హైకోర్టు పేర్కొంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు రెండు వారాల్లో డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిటిషన్పై విచారణ జరిపిన హైకోర్టు తాజాగా ఈ ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 6 నుంచి కులగణన చేసేందుకు రేవంత్ ప్రభుత్వం సిద్ధమైంది. తాజాగా హైకోర్టు తీర్పుతో ఈ సర్వేకు మరికొన్నిరోజుల పాటు బ్రేక్ పడే ఛాన్స్ ఉంది. మరోవైపు త్వరలోనే అన్ని జిల్లాల్లో కులగణనపై సమావేశాలు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకునేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ హామీ మేరకు కులగణన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వే వల్ల అందరిలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని.. ఇక భవిష్యత్తులో మిగతా రాష్ట్రాలన్నీ కూడా తెలంగాణను అనుసరిస్తుందని తెలిపారు. నవంబర్ 6న రాహుల్ గాంధీని తెలంగాణకు ఆహ్వానించాలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. గాంధీ భవన్లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో జరిగిన మీటింగ్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు. కులగణన తర్వాత ఏయే సంక్షేమ కార్యక్రమాలకు ఎంత నిధులు కేటాయించాలో అనేదానిపై స్పష్టత వచ్చే ఛాన్స్ ఉంది. దీనికి సంబంధించి త్వరలోనే అఖిలపక్ష సమావేశం కూడా నిర్వహిస్తామని మంత్రులు తెలిపారు. వచ్చే ఏడాది కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలు చేపట్టనుంది. అయితే జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేయాలని కాంగ్రెస్ సహా ఇతర విపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.




కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్‌హౌస్ కేసు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధానికి తెరతీస్తోంది. ఇరు పార్టీల నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటున్నారు. జన్వాడ ఫామ్?హౌస్ దాడిలో పోలీసులు కొంత విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు.. విజయ్ మద్దూరి అనే వ్యక్తి శరీరంలో డ్రగ్స్(కొకైన్) ఆనవాళ్లను గుర్తించడంతో ఈ వివాదం మొదలైంది.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్ట్ చేయాలె..** మంగళవారం(అక్టోబర్ 29) ఈ విషయంపై మాట్లాడిన రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరికీ డ్రగ్స్ టెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ వ్యవహారం బయటికొచ్చిన ప్రతి సారి ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా బయటికొచ్చి ఒకే మాట మాట్లాడుతుండటం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. సిగ్గు, శరం ఉంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెంటనే డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలని నిలదీశారు.

**మేము సిద్ధం.. కౌశిక్ రెడ్డి...** రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ వ్యాఖలపై స్పందించిన కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ నేతల సవాల్ ను తాము స్వీకరిస్తున్నట్లు తెలిపాడు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా బ్లడ్ శాంపిల్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిద్ధమా అంటూ సవాల్ విసిరాడు. ఏ ఆస్పత్రికైనా అందరం కలిసి వెళ్దాం అంటూ ఛాలెంజ్ విసిరారు.

**ఏమాయే బీఆర్ఎస్ ఎమ్మెల్యే వస్తా అన్నావ్..** డ్రగ్స్ టెస్ట్ చేపించుకోవడానికి ఏ ఆస్పత్రికైనా అందరం కలిసి వెళ్దాం అంటూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి విసిరిన ఛాలెంజ్‌ను రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్వీకరించారు. కౌశిక్ రెడ్డి చెప్పినట్లు టెస్ట్ శాంపిల్స్ ఇవ్వడానికి మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో కాంగ్రెస్ నేతలిద్దరూ ఏఐజీ హాస్పిటల్‌కు చేరుకున్నారు. తీరా అక్కడకు వెళ్లాక కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు కనిపించకపోవడంతో వారు అవాక్కయ్యారు. చిన్న బాస్ కేటీఆర్, పెద్ద బాస్ కేసీఆర్‌ని తీసుకొస్తా అన్న కౌశిక్ రెడ్డి ఎక్కడని వారు ప్రశ్నించారు. దాదాపు రెండు గంటల పాటు బీఆర్ఎస్ నేతల కోసం వారు ఎదురు చూశారు. తీరా వారు రాకపోయేసరికి అక్కడి నుంచి వెనుదిరిగారు.




హైదరాబాద్: గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1200 కోట్ల నిధులు విడుదల చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మిగిలిన రూ.1000 కోట్ల నిధులను రేవంత్‌రెడ్డి సర్కారు ఇతర కార్యకలాపాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్న రఘునందన్.. పల్లె ప్రగతికి నిధులు వెచ్చించడం లేదని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా శానిటైజేషన్ కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు.

# గిరిజన బాలికకు సీఎం రేవంత్ సాయం.. ఎందుకంటే

కొమురంభీం, అక్టోబర్ 30: డాక్టర్ అవ్వడం ఆ అమ్మాయి కల. అందుకోసం కష్టపడి చదవడంతో ఎంబీబీఎస్‌లో సీటు కూడా సంపాదించింది. కానీ ఇక్కడే ఆమెకు ఆర్థిక పరిస్థితులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎంబీబీఎస్ సీటు సాధించినప్పటికీ కాలేజీ ఫీజు కట్టే స్తోమత ఆ కుటుంబానికి లేకుండాపోయింది. దీంతో డాక్టర్ కావాలన్న విద్యార్థిని ఆశపై ఆర్థిక పరిస్థితులు నీళ్లు చల్లుతున్న పరిస్థితి. బాలిక విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. బాలిక చదవుకునేందుకు ప్రభుత్వం తరపున సహకారం అందించేందుకు సీఎం ముందుకొచ్చారు. ఆ బాలికకు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇంతకీ ఆ బాలిక ఎవరో చూద్దాం. కొమురం భీం జిల్లా జూనూరు మండలం జెండాగూడ గ్రామానికి చెందిన గిరిజన బాలిక సాయి శ్రద్ధ. ఈ బాలిక ఎంతో మంచి స్టూడెంట్. చిన్నప్పటి నుంచి కష్టపడి చదువుతూ అన్నింటిలోనూ ఫస్ట్‌ర్యాంక్ తెచ్చుకుంది. అంతే కాదు పదో తరగతిలోనూ మంచి మార్కులు తెచ్చుకుంది. అయితే ఆమె కల మాత్రం డాక్టర్ అవడం. ఇందు కోసం కష్టపడి చదవింది కూడా. ఆమె కష్టానికి ప్రతిఫలంగా ఎంబీబీఎస్‌లో మంచి మార్కులు వచ్చి సీటు కూడా సంపాదించింది. కానీ ఇక్కడే ఆమెకు అసలు కష్టాలు మొదలయ్యాయి. డాక్టర్ చదువుకు చాలా డబ్బు ఖర్చు అవుతుంది. కానీ సాయి శ్రద్ధ కుటుంబీకులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూట గడవడానికి వారికి కష్టంగా ఉంది. ఈ సమయంలో తమ బిడ్డకు ఎంబీబీఎస్‌లో సీటు వచ్చిందని తల్లిదండ్రులు సంతోషించారు. కానీ కాలేజ్‌లో జాయిన్ చేసేందుకు డబ్బులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి చదవి ఎంబీబీఎస్‌లో సీటు సాధించినప్పటికీ కాలేజీ ఫీజు కట్టేందుకు ఆర్థిక స్థోమత లేక సాయి శ్రద్ధ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. డాక్టర్ అవ్వాలనే కల నెరవేరేందుకు ఆర్థికి ఇబ్బందులు అడ్డంకిగా మారాయి. దీంతో తన కలను ఎలా నెరవేర్చుకోవాలో తెలీక బాలిక సతమతమవుతున్న పరిస్థితి. అయితే బాలిక సాయి శ్రద్ధ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లింది. వెంటనే స్పందించిన సీఎం.. బాలిక చదవు విషయంలో సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. డాక్టర్ కావాలన్న ఆ అమ్మాయి కలను నెరవేర్చే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు సీఎం. అంతే కాకుండా బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం కూడా అందజేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. డాక్టర్ చదువు చదివేందుకు స్వయంగా ముఖ్యమంత్రి సహాయం చేస్తుండంతో బాలిక ఆనందం వ్యక్తం చేసింది. తాను చదువుకునేందుకు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాలిక సాయిశ్రద్ధ, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం సాయంతో ఆ అమ్మాయి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఇకపై డాక్టర్ చదవేందుకు ఎలాంటి ఆటంకం లేవని.. కష్టపడి చదవి డాక్టర్ అవుతానని బాలిక చెబుతోంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com